www.trinetnews.com
# ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక

## నైట్‌క్లబ్‌లో యువతిని వివస్త్రను చేసి.. బౌన్సర్ల దాడి

నైట్‌క్లబ్‌లో బౌన్సర్లు ఓ యువతిని వివస్త్రను చేసి, దాడి చేసిన దారుణ ఘటన అస్సాంలోని గువాహటిలో చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే..

గువాహటిలోని ఖానాపారా ప్రాంతంలో ఉన్న నైట్‌క్లబ్ లో గురువారం అర్ధరాత్రి ఒక యువతిపై కొందరు మహిళా, పురుష బౌన్సర్లు అమానుషంగా ప్రవర్తించారు. ఆమెను వివస్త్రను చేసి, కింద పడేసి తీవ్రంగా కొట్టారు. ఇతరులు అడ్డుకోవడానికి ప్రయత్నించినప్పటికీ దాడి చేయడం ఆపలేదు. అనంతరం బాధితురాలిని క్లబ్ నాలుగో అంతస్తు నుంచి పార్కింగ్ ప్రాంతానికి తీసుకెళ్లిన దృశ్యాలు బయటికొచ్చాయి.

సంపుటి 01 సంచిక 60 ఎడిటర్ :వెంకటేశ్వర్లు రాపోలు ఆదివారం అక్టోబర్ 04, 2026 పేజీలు:12 వెల.10/-

# మనకు ఏఐ-ఆధారిత దళం ఉండాలి:

## ఐఏఎఫ్ చీఫ్ ఏపీ సింగ్


2లో..

- సుఖోయ్ ఎస్‌యూ-57 అందించేందుకు రష్యా సిద్ధం.
- భారత్‌లోనే ఉమ్మడి ఉత్పత్తికి అవకాశం.
- భవిష్యత్ యుద్ధాలకు ఏఐ ఆధారిత దళం అవసరం.
- 114 రఫేల్ విమానాల ఒప్పందంపై చర్చలు.
- ఏటా 36--40 యుద్ధ విమానాలు అవసరం.
- సొంతంగా యుద్ధ విమాన ఇంజిన్‌ల తయారీ అవసరం.


2లో..

- స్మిత్ మచ్చర్ అబుధాబిలో చికిత్స.
- వేగంగా కోలుకుంటున్నారని భారత ఎంబసీ వెల్లడి.
- కుటుంబ సభ్యులు, అధికారులతో ఎంబసీ టచ్‌లో ఉంది.
- స్మిత్‌ను దుబాయ్ యువరాజు హమ్దాన్ పరామర్శించారు.

# 'మాకు గర్వకారణం'..

స్మిత్ మచ్చర్‌కు దుబాయ్ యువరాజు ఆత్మీయ ముద్దు

# ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్, ఉస్మానియా ఆసుపత్రుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

## సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 03 :** రాష్ట్రంలో విద్య, వైద్యానికి సంబంధించిన క్షేత్రస్థాయి పరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. శనివారం సీఎంవో అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రధాన ఆసుపత్రుల నిర్మాణం, పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్, ఉస్మానియా ఆసుపత్రుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ఆసుపత్రుల్లో వైద్యులు, ఇతర సిబ్బంది అవసరాలను గుర్తించి నియామక ప్రక్రియను మొదలు పెట్టాలని, ఆసుపత్రుల నిర్మాణం పూర్తయ్యే నాటికి సిబ్బంది కొరత లేకుండా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సీఎం ఆదేశించారు. ఆసుపత్రుల్లో అవసరమైన అత్యాధునిక పరికారాలను కొనుగోలు చేసి, ఆసుపత్రుల నిర్మాణం పూర్తయ్యేనాటికి అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లా కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతో పాటు అధికారులు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్, ఆసుపత్రులను సందర్శించాల్సిందేనని స్పష్టం చేశారు. సంబంధిత జిల్లాకు సంబంధించి జిల్లా స్థాయిలో ప్రతీ వారం వీటిపై సమీక్ష నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాఠశాలల్లో అవసరమైన చోట మరమ్మతు పనులను చేపట్టాలని తెలిపారు. డిసెంబరులో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించ తలపెట్టిన తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 ఏర్పాట్లపైనా సమావేశంలో అధికారులతో చర్చించారు. పేజి 2లో ▶

# 'బొల్లారం' కేసు..

దోపిడీలు చేసేందుకే ఆయుధాల చోరీ:

## సీపీ సుమతి



బొల్లారం ఆర్మీ ఆయుధాల చోరీ కేసులో 7 మంది అరెస్టు.
ప్రధాన నిందితుడు మల్లేశ్ వివరాలతో దర్యాప్తులో పురోగతి.
అరెస్టైన వారిలో ముగ్గురు ఆర్మీ సిబ్బంది.
కేసులో ఉగ్ర లింకులు లేవు: పోలీసులు.
ఆయుధాలతో బెదిరించి దోపిడీలకు కుట్ర.
బ్యాంకులు, జ్యువెలరీ షాపులను లక్ష్యంగా చేసుకున్నట్లు వెల్లడి.

2లో..

## గౌరవెల్లి భూసేకరణ, పునరావాస సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

-నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 03:** రాష్ట్ర సచివాలయంలో శనివారం గౌరవెల్లి ప్రాజెక్టుపై నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూసేకరణ, పునరావాస ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. భూసేకరణకు అవసరమైన నిధులు ఇప్పటికే సంబంధిత జిల్లాల కలెక్టర్లకు చేరాయని మంత్రి తెలిపారు. పేజి 2లో ▶

## నాణ్యమైన విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

-వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


2లో..

## పాకిస్థాన్ పై టీమ్ ఇండియా విజయం పట్ల సీఎం రేవంత్ రెడ్డి హర్షం



2లో..

ఆసియా క్రీడల్లో పాకిస్థాన్‌పై భారత్ విజయం.
పురుషుల క్రికెట్‌లో టీమ్ ఇండియాకు స్వర్ణ పతకం.
జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు సీఎం

# కామన్ పాస్‌తో సులభ ప్రయాణం

మెట్రో, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



- ప్రయాణికుల సౌకర్యమే లక్ష్యం.. మెట్రో--ఆర్టీసీ అనుసంధానానికి శ్రీకారం
- ప్రయాణికుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 02 :** హైదరాబాద్ నగర ప్రజా రవాణా వ్యవస్థను మరింత సౌకర్యవంతంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. మెట్రో రైలు, టీజీఎస్‌ఆర్టీసీ బస్సు సేవలను అనుసంధానం చేస్తూ ప్రవేశపెట్టిన ఆర్టీసీ--మెట్రో కామన్ పాస్ ద్వారా ప్రయాణికులకు ఒకే పాస్‌తో మరింత సులభంగా గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం కల్పించింది. ఈ సౌకర్యం అమలు తీరును స్వయంగా పరిశీలించేందుకు ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క మెట్రో రైలు, ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. బేగంపేట మెట్రో స్టేషన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గణేష్, నవీన్ యాదవ్, అధికారులు కామన్ పాస్‌తో మెట్రోలో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పలువురు ప్రయాణికులతో నేరుగా మాట్లాడి కామన్ పాస్ వినియోగం ఎలా ఉంది? మెట్రో నుంచి బస్సుకు మారే సమయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా? పేజి 2లో ▶

# సంపాదకీయం

## 'ప్రభుత్వ వ్యతిరేకత'కు బీజేపీ అతీతమా?

రాహుల్‌గాంధీ ఇటీవల ఒక ప్రశ్న అడిగారు. రాజకీయ వర్గాలలో కలకలం సృష్టించిన ఆ ప్రశ్న సులభంగా ఉన్నట్టు కనిపిస్తున్నా నిజానికి సంక్లిష్టమైనది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, భారతీయ జనతా పార్టీ ఒక దశాబ్దానికి పైగా అధికారంలో ఉన్నప్పటికీ ప్రభుత్వ వ్యతిరేకత ప్రభావానికి ఎందుకు గురికావడం లేదు? 1977లో ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగా ఉన్న కారణంగా మా నానమ్మ ఇందిర సైతం ఓడిపోయారు అని ఆయన అన్నారు. మోదీ నేతృత్వంలోని బీజేపీ అధికారంలో కొనసాగేలా ఎన్నికల ప్రక్రియను తారుమారు చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు.

ఇది చాలా తీవ్రమైన ఆరోపణ. ఎన్నికల్లో జయాపజయాల విషయమై రాహుల్ ఇటీవల చేసిన వివిధ వ్యాఖ్యలలో మాదిరిగానే తాజా ఆరోపణలో కూడా ఒక ఇబ్బందికరమైన సత్యం ఉంది. ఒక విషయంలో రాహుల్ సరిగానే మాట్లాడారు. ఎన్నికల సంఘం తీవ్ర విశ్వసనీయత లోటును ఎదుర్కొంటోంది. అవును, ఈ సత్యం ఇంకెంత మాత్రం ఒక చర్చనీయాంశంగా ప్రతిపక్షాలకే పరిమితమై లేదు. ఈసీఐపై ప్రజలు నమ్మకం కోల్పోతున్నారనడం సత్యదూరం కాదు. ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై వివాదం, పశ్చిమ బెంగాల్‌లో ఓటర్లు నివేదించిన వివరాలలో 'తార్కిక వ్యత్యాసం'కు సంబంధించిన సమస్యలు, లక్షలాది ఓటర్ల తొలగింపుపై రగడ, ఓటర్ల అప్పీళ్లపై విచారణలో జాప్యం మొదలైనవన్నీ ఎన్నికల సంఘం పారదర్శకతపై న్యాయబద్ధమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. రాజ్యాంగ సంస్థల మధ్య 'విశ్వాస లోటు' ఉన్నదని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించిందంటే పరిస్థితి ఎలా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు.

ఓటర్ జాబితాల ధర్మబద్ధత గురించి పట్టించుకునే ఎవరికైనా ఈ అంకెలు ఆందోళన కలిగిస్తాయి. బెంగాల్‌లో ఇంతవరకు 22 లక్షల మంది పౌరులు తమ ఓటు హక్కు తొలగింపుపై అప్పీల్ చేశారు. విచారణ పూర్తయిన అప్పీళ్లలో 93శాతం మంది చట్టబద్ధమైన ఓటర్లే అని నిర్ధారణ అయింది. ఎన్నికలు అంటే కేవలం పోలింగ్ రోజున జరిగే ప్రక్రియ మాత్రమే కాదు. ఓటర్ జాబితాలలో ఎవరికి చోటు దక్కుతుందనే అంశంతోనే నిజానికి ఎన్నికలు ప్రారంభమవుతాయి. మరి తన పనితీరుపై ఆందోళనలను కేవలం రాజకీయ ఆరోపణలు మాత్రమేనని ఎన్నికల సంఘం ఎలా కొట్టివేయగలుగుతుంది? ఎన్నికల సంఘం తటస్థ మధ్యవర్తిగా వ్యవహరించడం లేదనే ఆందోళనలు ఇటీవల వివిధ అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించిన తీరుతెన్నుల ఆధారంగానే వ్యక్తమవుతున్నాయన్నది నిరాకరించలేని వాస్తవం.

మన దేశంలో ఒపీనియన్ పోల్స్ నిర్వహించే ఏజెన్సీలు కూడా రాజకీయ కుట్రల్లో భాగమా? 2014 నుంచి నరేంద్ర మోదీకి ప్రజాదరణ-- ముఖ్యంగా హిందీ భాషా రాష్ట్రాలలోను, పశ్చిమ భారత రాష్ట్రాలలోనూ అంతకంతకూ పెరుగుతోందని అన్ని ఒపీనియన్ పోల్స్ ఫలితాలు నిర్ధారిస్తూనే ఉన్నాయి. ఆ పోల్స్ అన్నీ ప్రామాణిక పద్ధతులలో జరిగి ఉండకపోవచ్చు. అయినంతమాత్రాన వాటి ఫలితాలకు కారణమైన రాజకీయ పరిణామాన్ని కొట్టివేయడం సబబు కాదు. దానిని నిష్పాక్షికంగా అర్థం చేసుకోవాలి. కాంగ్రెస్ పార్టీకి అసాధ్యంగా ఉన్న మహా శక్తిమంతమైన రాజకీయ, సంస్థాగత యంత్రాంగాన్ని బీజేపీ అభివృద్ధిపరచుకున్నది. కార్యకర్తల బలాన్ని అపారంగా పెంచుకున్నది. పైగా ఆరెస్సెస్ నుంచి సంపూర్ణ మద్దతు బీజేపీకి లభిస్తోంది. ఆర్థిక వనరులు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయి. పార్టీ సందేశాలను ప్రభావదాయకంగా ప్రజలలోకి తీసుకువెళ్లే సామర్థ్యం తక్కువేమీ కాదు. కనుకనే జాతీయ ప్రాధాన్యమున్న అంశాలను ఎన్నికల ప్రచారానికి చాలా నేర్పుగా, ప్రయోజనకరంగా ఉపయోగించుకోవడంలో బీజేపీ సదా సఫలమవుతోంది.

ఎన్నికల వ్యయాలపై ఈసీఐకి నివేదించిన వివరాల ప్రకారం, ఈ ఏడాది ఐదు రాష్ట్రాలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ మొత్తం రూ.529.38 కోట్లు ఖర్చు చేసింది. ఆ ఐదు రాష్ట్రాలలో కాంగ్రెస్ చేసిన వ్యయం రూ. 248.55 కోట్లు. బీజేపీ ఒక్క బెంగాల్‌లోనే చేసిన వ్యయం, ఐదు రాష్ట్రాలలో కాంగ్రెస్ ఖర్చు చేసిన మొత్తం కంటే ఎక్కువగా ఉన్నది. ఈసీఐ వెల్లడించిన లెక్కల ప్రకారం, బెంగాల్‌లో బీజేపీ ఎన్నికల వ్యయం రూ.286.99 కోట్లుగా ఉన్నది. ఆయా పార్టీలు చేసిన వ్యయాలు ఇంకా అధికంగా ఉంటాయనడంలో సందేహం లేదు. అయితే అవేవీ ఎన్నికలలో అక్రమాలు జరిగాయన్న విషయాన్ని రుజువు చేయలేవు. ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికల కాలంలోనే తమకు అందిన విరాళాలు మొత్తం రూ.1,473 కోట్లు అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యాలయం వెల్లడించింది. అదే కాలంలో కాంగ్రెస్‌కు విరాళాల రూపేణా కేవలం రూ.207 కోట్లు మాత్రమే సమకూరాయి. చెప్పవచ్చినదేమిటంటే ఒక శక్తిమంతమైన ఎన్నికల యంత్రాంగం ఎలా పనిచేస్తుందో అర్థం చేసుకోవడానికి ఎలాంటి కుట్ర సిద్ధాంతాలు అవసరం లేదు. గతంలో దశాబ్దాలుగా అధికారంలో ఉన్న ప్రధాన ప్రతిపక్షం అధికార పార్టీతో సమానంగా సమర్థ యంత్రాంగాన్ని ఎందుకు నిర్మించుకోలేకపోయింది? ఈ ప్రశ్నను రాహుల్‌గాంధీ ఎదుర్కోవాలి.

కాంగ్రెస్‌కు వాటిల్లిన సమస్యలన్నిటికీ ఈసీఐని తప్పుపట్టడం ఎంతమాత్రం వివేకం కాదు. నాయకత్వ తగాదాలు, సంస్థాగత క్షీణత, ముఠాల కుమ్ములాటలు, ఫిరాయింపులు, బలహీనపడిన పీసీసీలు మొదలైనవన్నీ కాంగ్రెస్ స్వయంకృతాలే కానీ ఈసీఐ ప్రమేయంతో జరిగినవి కావు కదా. ఇదిగో ఇక్కడే ప్రభుత్వ వ్యతిరేకత అనే వాదన మరింత ఆసక్తికరమవుతోంది. ఎందుకంటే ప్రభుత్వ వ్యతిరేకత అనేది ఉంది. అదొక వాస్తవం. 2018లో మూడు హిందీ రాష్ట్రాలలో బీజేపీని కాంగ్రెస్ ఓడించింది. 2023లో కర్ణాటకలో బీజేపీ అధికారాన్ని కోల్పోయింది. 2024 సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ కనీస మెజారిటీని కూడా సాధించుకోలేకపోయింది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి మిత్రపక్షాలపై ఆధారపడడం అనివార్యమయింది. భారతీయ ఓటర్లు అధికారంలో ఉన్నవారిని శిక్షిస్తారని, శిక్షించగలరని ఈ జయాపజయాలు స్పష్టం చేస్తున్నాయి. మోదీపై ప్రభుత్వ వ్యతిరేకత ఎందుకు పనిచేయడం లేదు? ప్రతిపక్షాలు ప్రభుత్వ వ్యతిరేకతను ఒక సుస్థిర జాతీయ ప్రత్యామ్నాయంగా ఎందుకు మార్చలేకపోతున్నాయి? మొదటిదానికంటే రెండోదే మరింత ఆసక్తికరమైన ప్రశ్న. ఈ రెండు ప్రశ్నల మధ్య ఉన్న తేడా చాలా ముఖ్యమైనది. బీజేపీని ఎన్నికల్లో ఓడించడం అసాధ్యం కావచ్చు కానీ ప్రతిపక్షాలు ఆ పార్టీని రాజకీయంగా ఎందుకు ఎదుర్కోలేకపోతున్నాయి, సులభంగా ఎందుకు ఓడిపోతున్నాయని కాంగ్రెస్ తప్పక ప్రశ్నించుకోవాలి. నైరాశ్యానికి లోనవుతూ దాన్ని అధిగమించడానికి ప్రయత్నించకపోతే ఎలా? ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పన్నెండేళ్లకు పైగా దేశాన్ని పరిపాలిస్తున్నారు. రాజకీయ అలసట, అసంతృప్తి, బలహీనతలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రతిపక్షాలకు ఇదొక రాజకీయ అవకాశం. అయితే రాజకీయ అవకాశమే రాజకీయ విజయానికి రాచబాట వేయదు. ప్రభుత్వ వ్యతిరేకత అయితే ఉన్నది. దానిని ఓట్లు, సీట్లుగా మార్చడానికి ఒక సువ్యవస్థిత రాజకీయ వేదిక అవసరం.

మళ్లీ రాహుల్‌గాంధీ వద్దకు వెళదాం. తన ప్రశ్నలకు ఈసీఐ సమాధానాలు చెప్పాలని ఆయన డిమాండ్ చేయడం సమంజసమే. ఎన్నికల సంఘానికి, ఆ మాటకు వస్తే ఏ రాజ్యాంగ సంస్థకు అయినా పారదర్శకత, జవాబుదారీతనం, సంస్థాగత విశ్వసనీయత ఉండడం అవసరం. ఓటర్ల జాబితాపై రగులుతున్న వివాదం స్పష్టం చేస్తున్నదేమిటి? ఈసీఐ తన విధులను మరింత పారదర్శకతతో నిర్వహించాలనే కాదూ? సర్ ప్రక్రియకు సంబంధించిన సమాచారాన్ని సంపూర్ణంగా వెల్లడించాలి. దానిని స్వతంత్ర వ్యక్తులు, సంస్థలు పరిశీలించి నిగ్గు తేల్చాలి. ఇది తప్పనిసరి. ఈసీఐ ప్రమేయం కీలకంగా లేని ప్రాంతాలలో కాంగ్రెస్ పరాజయం పాలయింది. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో కాంగ్రెస్‌కు ఘనమైన ఎన్నికల విజయాలు లభించాయి. ఎన్నికల మధ్యవర్తి-- అంటే ఈసీఐ తన విధులు సక్రమంగా నిర్వర్తించనందునే బీజేపీ అసాధారణ విజయాలు మూటగట్టుకుందని విమర్శించడం సబబుకాదు. ఈసీఐ కంటే బాగా సహాయకారి అయిన రాజకీయ, సంస్థాగత, సైద్ధాంతిక, నాయకత్వ కారణాలు బీజేపీ విజయాల వెనుక ఉన్నాయి. ఈ వాస్తవాన్ని విపక్షాలు విస్మరించకూడదు.

కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాలను చక్కదిద్దడంపై రాహుల్‌గాంధీ తన దృష్టిని కేంద్రీకరించాలి. అలా కాకుండా బాహ్య సమస్యలపై ఆయన ఎంత ఎక్కువగా దృష్టి పెడితే, తన అంతర్గత లోపాలను సరిదిద్దుకోవడంలో కాంగ్రెస్‌పై అంత తక్కువ ఒత్తిడి ఉంటుంది. దీనివల్ల వాటిల్లే ప్రమాదాన్ని రాహుల్ గుర్తించాలి. ఎన్నికల ప్రక్రియ సమగ్రతను రక్షించేందుకు కృషి చేస్తూనే తన సంస్థాగత లోపాలను సరిదిద్దుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నించాలి. ఈ రెండిటినీ ఏకకాలంలో నిర్వర్తించడం నిజంగా ఒక పెద్ద సవాలు. రెండూ అవసరమే. ఏదో ఒకటి మాత్రమే సరిపోదు.

2009--24 సంవత్సరాల మధ్య బీజేపీకి లభించిన మొత్తం ఓట్ల సంఖ్య 7.84 కోట్ల నుంచి 23.59 కోట్లకు పెరిగింది. ఇదే కాలంలో కాంగ్రెస్‌కు లభించిన మొత్తం ఓట్ల సంఖ్య 11.9 కోట్ల నుంచి 13.67 కోట్లకు మాత్రమే పెరిగింది. ఈ గణాంకాలు సమస్త జయాపజయాలన్నిటికీ వివరణ ఇవ్వలేవు. భారతదేశ ఎన్నికల ముఖచిత్రం జాతీయ ఓట్ల లెక్కింపు కంటే చాలా క్లిష్టమైనది. అయితే ప్రధాన జాతీయ పక్షాలకు లభించిన మొత్తం ఓట్ల సంఖ్యలో తేడాలు దేశంలో సంభవించిన రాజకీయ మార్పు భారీ స్థాయిని సూచిస్తున్నాయి. ఈ భారీ మార్పును సుసాధ్యం చేసిందేమిటి? మోదీత్వ అనండి, మోదీ హవా అనండి, హిందుత్వ రాజకీయ విజయం అనండి, బీజేపీ సంస్థాగత ఆధిక్యత అనండి లేదా ఎన్నికలలో గెలవడంలో బీజేపీ చాకచక్యాలు అనండి... అయితే ఈసీఐ వల్లే దేశ రాజకీయాలలో ఈ పెనుమార్పు వచ్చిందని అనవద్దు. ఎన్నికల సంఘం తన విశ్వసనీయత లోటుకు సంజాయిషీ ఇవ్వాలి. కాంగ్రెస్ పార్టీ తన సొంత లోపాలకు సమాధానమివ్వాలి. భారతదేశంలో

## నాణ్యమైన విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 03:
రాష్ట్రంలో నూనెగింజలు, పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం, ఉత్పత్తిని పెంచడంతో పాటు రైతులకు నాణ్యమైన ధృవీకరించిన విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం సచివాలయంలో శ్రీ రైతు నేస్తం కార్యక్రమంలో రబీ 2026-27 నూనెగింజలు, పప్పుధాన్యాల విత్తన పంపిణీని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జాతీయ తినదగిన నూనెలు-- నూనెగింజల మిషన్ (ఔచీఉూ-ూూ) కింద రబీ 2026-27లో 29,375 క్వింటాళ్ల నూనెగింజల విత్తనాలను 52,425 ఎకరాల్లో పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందుకోసం రూ.36.76 కోట్ల సబ్సిడీ అందించనున్నారు. వేరుశనగ, కుసుమ, పొద్దుతిరుగుడు, నువ్వుల పంటలకు ధృవీకరించిన విత్తనాలను రైతులకు అందించనున్నారు.

నూనెగింజల సాగులో ఆధునిక పద్ధతులను ప్రోత్సహించేందుకు 1,200 ఎకరాల్లో బ్లాక్ స్థాయి ప్రదర్శనలు నిర్వహించనున్నారు. వీటి ద్వారా రైతులకు మెరుగైన సాగు పద్ధతులు, అధిక దిగుబడుల సాధనపై అవగాహన కల్పించనున్నారు.

పప్పుధాన్యాల్లో ఆత్మనిర్భరత మిషన్ (పీూచీూ) కింద రబీ 2026-27లో 29,008 క్వింటాళ్ల పప్పుధాన్యాల విత్తనాలను సుమారు 1.09 లక్షల ఎకరాలకు పంపిణీ చేయాలని ప్రణాళిక రూపొందించారు. శనగ, మినుము, పెసర పంటలకు సబ్సిడీపై విత్తనాలను అందించనున్నట్లు మంత్రి తెలిపారు. నూనెగింజలు, పప్పుధాన్యాల దేశీయ ఉత్పత్తిని పెంచడం, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహించడం ద్వారా దేశంలో ఆత్మనిర్భరత సాధించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలను సకాలంలో అందుబాటులోకి తీసుకురావడం, సాగు ఉత్పాదకతను పెంచడం, రైతుల ఆదాయాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా వ్యవసాయ శాఖ సమగ్ర కార్యాచరణను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు.

## పాకిస్థాన్ పై టీమ్ ఇండియా విజయం పట్ల సీఎం రేవంత్ రెడ్డి హర్షం

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 03:
జపాన్లో జరుగుతున్న 2026 ఆసియా క్రీడల్లో పురుషుల క్రికెట్ ఫైనల్లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్పై అద్భుత విజయం సాధించిన టీమ్ ఇండియాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ స్వర్ణ పతకం దేశానికి అపారమైన గౌరవాన్ని, కీర్తిని తీసుకువచ్చి, అంతర్జాతీయ క్రీడా వేదికపై భారత క్రీడా విజయాల చరిత్రలో మరో చిరస్మరణీయ అధ్యాయంగా మిగులుతుందని పేర్కొంటూ టీమ్ ఇండియా జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్కు అభినందనలు తెలిపారు. అభిషేక్ శర్మ అద్భుతంగా సాధించిన 61 పరుగుల ఇన్నింగ్స్కు, తెలంగాణ స్టార్ క్రికెటర్ తిలక్ వర్మ అజేయంగా చేసిన 51 పరుగులకు, అలాగే కీలకమైన ప్రారంభ వికెట్లు తీసిన అక్షర్ పటేల్ల క్రీడాస్ఫూర్తిని ముఖ్యమంత్రి ప్రశంసించారు. ఆసియా క్రీడల్లో వివిధ క్రీడాల్లో పట్టుదల, అంకితభావం, క్రీడాస్ఫూర్తితో పోటీపడి పతకాలు సాధించి, అంతర్జాతీయ క్రీడా రంగంలో భారత ప్రతిష్ఠను మరింత పెంచిన భారతీయ క్రీడాకారులందరికీ ముఖ్యమంత్రి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

## కామన్ పాస్‌తో సులభ ప్రయాణం

మొదటిపేజీ తరువాయి

ప్రయాణం సులభమైందా? వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు.
ప్రయాణికుల నుంచి సానుకూల స్పందన
?కామన్ పాస్ తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పలువురు ప్రయాణికులు భట్టికి తెలిపారు. మెట్రోలో ప్రయాణించిన అనంతరం గమ్యస్థానానికి చేరుకునేందుకు ఆర్టీసీ బస్సు సేవలు అందుబాటులో ఉండటం వల్ల సమయం ఆదా అవుతోందని చెప్పారు. ప్రత్యేకంగా మరో టికెట్ తీసుకోవాల్సిన అవసరం లేకపోవడం సౌకర్యంగా ఉందన్నారు. మెట్రో నుంచి దిగిన తర్వాత ఏ బస్సు ఎక్కాలి, ఏ మార్గంలో వెళ్లాలి అనే విషయంలో గతంలో ఎదురయ్యే అయోమయం కూడా తగ్గిందని ప్రయాణికులు వివరించారు. ప్రజా రవాణా వ్యవస్థలో మెట్రో--ఆర్టీసీ సేవలను అనుసంధానం చేయడం వల్ల రోజువారీ ప్రయాణికులకు ప్రయోజనం కలుగుతోందని పేర్కొన్నారు.

### బస్సులోనూ ప్రయాణికులతో ముచ్చట

జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి భట్టి విక్రమార్క సహచర మంత్రులతో కలిసి టీజీఎస్ఆర్టీసీ బస్సులో సెక్రటేరియట్ వరకు ప్రయాణించారు. బస్సులోనూ ప్రయాణికులతో ముచ్చటిస్తూ కామన్ పాస్ వినియోగం, ప్రయాణ సౌకర్యం, మెట్రో--బస్సు అనుసంధానంపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

### ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరం: భట్టి

ఆర్టీసీ--మెట్రో కామన్ పాస్ విధానం ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఒకే పాస్‌తో మెట్రో, ఆర్టీసీ బస్సులను సమన్వయంతో వినియోగించుకునే అవకాశం ఉండటంతో ప్రయాణికులకు గమ్యస్థానానికి చేరుకునే సమయంలో ఎదురయ్యే ఇబ్బందులు, అయోమయం తగ్గుతాయని తెలిపారు. మెట్రోలో ప్రయాణిస్తున్న మహిళలు, ఇతర ప్రయాణికులతో మాట్లాడగా కామన్ పాస్ విధానం సౌకర్యవంతంగా ఉందని వారు చెప్పారని భట్టి పేర్కొన్నారు. మెట్రో నుంచి దిగిన తర్వాత తమ ఇల్లు, కార్యాలయం లేదా ఇతర గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సు సేవలు అందుబాటులో ఉండటం వల్ల ప్రయాణం మరింత సులభతరం అవుతుందని అన్నారు. ప్రజా రవాణాలోని వివిధ మార్గాలను ఒకదానితో ఒకటి అనుసంధానం చేసి ప్రయాణికులకు 'సీమ్‌లెస్' ప్రయాణ అనుభూతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని భట్టి తెలిపారు. ప్రస్తుతం మెట్రో--ఆర్టీసీ సేవలను అనుసంధానం చేశామని, భవిష్యత్తులో ఆటోలు, ఊబర్ వంటి ఇతర రవాణా సేవలను కూడా అనుసంధానం చేసే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందని చెప్పారు. ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని కామన్ పాస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు భట్టి కృతజ్ఞతలు తెలిపారు.

### ప్రజా రవాణాను బలోపేతం చేస్తాం: పొన్నం

హైదరాబాద్‌లో ప్రజా రవాణా వ్యవస్థను మరింత సౌకర్యవంతంగా, సమర్థవంతంగా మార్చే లక్ష్యంతో ఆర్టీసీ--మెట్రో కామన్ పాస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఒకే పాస్‌తో ఆర్టీసీ, మెట్రో సేవలను వినియోగించుకునే అవకాశం ఉండటంతో ప్రయాణికులకు సమయం, శ్రమతో పాటు ఖర్చు కూడా ఆదా అవుతుందని అన్నారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు ప్రజా రవాణాను బలోపేతం చేయడం ముఖ్యమైన పరిష్కారమని పేర్కొన్నారు. ప్రజలను వ్యక్తిగత వాహనాల నుంచి ప్రజా రవాణా వైపు ఆకర్షించాలంటే ఆర్టీసీ, మెట్రో సేవలను సమన్వయంతో, సౌకర్యవంతంగా అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల ప్రయాణ భారాన్ని తగ్గించేందుకు డైలీ పాస్, మంత్లీ పాస్‌తో పాటు కామన్ పాస్‌ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు.

ప్రయాణికుల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను పరిగణనలోకి తీసుకుని కామన్ పాస్ సేవలను మరింత మెరుగుపరుస్తామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రజలకు ఆర్థికంగా అందుబాటులో ఉండేలా మెరుగైన ప్రజా రవాణా సౌకర్యాలను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. హైదరాబాద్ భవిష్యత్తు అభివృద్ధి, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల ప్రయాణ కష్టాలను తగ్గించడంలో ప్రజా రవాణా కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ప్రభుత్వ సలహాదారు (అర్బన్ ట్రాన్స్‌పోర్ట్--మెట్రో) ఎన్.వి.ఎస్.రెడ్డి, మెట్రో ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, మెట్రో అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి.అజిత్‌రెడ్డి, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మనకు ఏఐ-ఆధారిత దళం ఉండాలి:

మొదటిపేజీ తరువాయి
భారత్‌కు ఐదోతరం అత్యాధునిక స్టెల్త్ యుద్ధ విమానం సుఖోయ్ ఎస్‌యూ-57 అందించేందుకు రష్యా సిద్ధంగా ఉందని భారత వైమానిక దళం చీఫ్ అమర్ ప్రీత్ సింగ్‌ఎ అన్నారు. వాటిని భారత్‌లోనే ఇరుదేశాలూ ఉమ్మడిగా ఉత్పత్తి చేసే అవకాశం కూడా ఉందని చెప్పారు. అయితే ఈ ప్రతిపాదనపై కేంద్రం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. భారత్‌కు ఉన్న మొత్తం సైనిక బలంలో వైమానిక శక్తి కీలకమైనదని, కృత్రిమ మేధ సాయంతో దానిని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఐఏఎఫ్‌ను ఆధునీకరించడం గురించి మాట్లాడుతూ.. భవిష్యత్ యుద్ధాలను ఎదుర్కొనేందుకు ఏఐ-ఆధారిత దళం ఉండాలని పేర్కొన్నారు.

అనుకున్న విధంగా జరిగితే.. త్వరలో ఫ్రాన్స్‌తో మల్టీ-రోల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ ఒప్పందాన్ని ఖరారు చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు ఐఏఎఫ్ చీఫ్ తెలిపారు. 114 రఫేల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేసేందుకు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రతిపాదనకు భారత్ ఫిబ్రవరిలో ఆమోదం తెలిపిందన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ధరలు, ఇతర కీలక అంశాలపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నట్లు చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో భారత వైమానిక దళానికి (ఐఏఎఫ్) ఏటా కనీసం 36-40 యుద్ధ విమానాలు అవసరమవుతాయని, ఇందుకోసం సొంతంగా యుద్ధ విమాన ఇంజిన్‌లను ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

## 'మాకు గర్వకారణం'..

మొదటిపేజీ తరువాయి
ఫ్లైదుబాయ్ విమాన ఘటనలో తీవ్రంగా గాయపడిన కెప్టెన్ స్మిత్ మచ్చర్ ప్రస్తుతం యూఏఈలోని అబుధాబీలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఆయన వేగంగా కోలుకుంటున్నారని యూఏఈలోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. "భారత ధైర్యశాలి కెప్టెన్ స్మిత్ మెరుగైన వైద్య సంరక్షణలో ఉన్నారు. వేగంగా కోలుకుంటున్నారు. ఆయన కుటుంబ సభ్యులు, స్థానిక అధికారులతో టచ్‌లో ఉన్నాం. యూఏఈ ప్రభుత్వానికి ధన్యవాదాలు" అని భారత ఎంబసీ తెలిపింది.

మరోవైపు.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న స్మిత్‌ను యూఏఈ ఉప ప్రధాని, దుబాయ్ యువరాజు హమ్దాన్ బిన్ మహమ్మద్ అల్ మక్తూమ్ పరామర్శించారు. " ప్రయాణికుల ప్రాణాల విషయంలో అత్యంత ధైర్యసాహసాలు కనబర్చిన పైలట్‌ను పరామర్శించాను. ఆయన మా బృందంలో, దేశ చరిత్రలో ఒక భాగం. యూఏఈ ఆశయాలకు ప్రతీకగా నిలవడం మాకు గర్వకారణం" అని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

## 'బొల్లారం' కేసు.. దోపిడీలు చేసేందుకే ఆయుధాల చోరీ: సీపీ సుమతి

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: బొల్లారం ఆర్మీ ఆయుధాల చోరీ కేసులో పురోగతి లభించింది. ప్రధాన నిందితుడు మల్లేశ్ ఇచ్చిన వివరాలతో ఆయుధాల చోరీ కేసులో మొత్తం ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. శేషు, వినోద్, ప్రవీణ్, నిరంజన్, మల్లికార్జున్, బీర్బల్ షా, అవి దెయ్‌ను అరెస్టు చేశారు.

ఈ కేసుకు సంబంధించిన వివరాలను మల్కాజిగిరి సీపీ సుమతి వెల్లడించారు. ఏ2 శేషు, ఏ3 వినోద్, ఏ4 ప్రవీణ్ ఆర్మీలో పని చేస్తున్నట్లు గుర్తించామన్నారు. "ఆర్మీ ఆయుధాల కేసులో ఉగ్ర లింకులు లేవని తేలింది. ఆయుధాలతో బెదిరించి చోరీలు చేసే ఉద్దేశంతోనే కుట్ర జరిగింది. ఇక్కడి నుంచి తీసుకెళ్లిన ఆయుధాలను.. బ్యాంకులు, జ్యువెలరీ షాపుల్లో చోరీలకు వాడాలనుకున్నారు. ధనవంతులను బెదిరించి దోపిడీ చేయాలని నిందితులు కుట్ర చేసినట్లు దర్యాప్తులో తేలింది. ఆయుధాలు కొనుగోలు చేసేందుకు పశ్చిమ బెంగాల్‌కు చెందిన బీర్బల్ షా, అవి దెయ్.. వీరిని సంప్రదించారు. పిస్టల్‌కు రూ.3లక్షలు, లాంగ్ వెపన్‌కు రూ.5 లక్షల చొప్పున ఒప్పందం జరిగింది" అని సీపీ వివరించారు.

## ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్, ఉస్మానియా ఆసుపత్రుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

మొదటిపేజీ తరువాయి
సమ్మిట్ ఏర్పాట్లు, అతిథులు, పెట్టుబడుల విషయంలో పకడ్బందీగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. త్వరలోనే ఏర్పాట్లను పరిశీలిస్తానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, సీఎంవో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## గౌరవెల్లి భూసేకరణ, పునరావాస సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

మొదటిపేజీ తరువాయి
భూసేకరణ, పునరావాస ప్రక్రియ వేగవంతానికి సత్వరం చర్యలు చేపట్టాలని సూచించారు. సిద్దిపేట, హనుమకొండ, కరీంనగర్ జిల్లాల భూసేకరణ వివరాలు, పెండింగ్ అంశాలపై చర్చించారు. గౌరవెల్లి నిర్వాసితుల పునరావాస సమస్యలపై సంబంధిత అధికారులు, ఉన్నతాధికారులతో సమగ్రంగా చర్చించారు.

అటవీ నోటిఫికేషన్ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రాజెక్టుకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే నా దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎడమ, కుడి కాలువల అంచనాలు, ప్రతిపాదనలపై చర్చించారు.

పంపిణీ కాలువల టెండర్ ప్రతిపాదనల స్థితిపై పరిశీలించారు. ప్రాజెక్టులో నీటి నింపుదల, విడుదల నివేదికలపై సమావేశంలో చర్చించారు. పర్యావరణ అనుమతులు, ఎన్‌జీటీ కేసుకు సంబంధించిన అంశాలపై ఎంఎంఆర్ ప్యాకేజీ--3 ప్రతిపాదనలపై సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో మహబూబాబాద్ లోకసభ సభ్యులు బలరాం నాయక్

సమీక్షలో నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ. శ్రీధర్, భూసేకరణ--పునరావాస కమిషనర్ శివకుమార్ నాయుడు, ఈఎన్‌సీ జనరల్ రమేష్ బాబు,ఇ. ఎన్ సి ఓడయం మధుసూదన్ రావు జాయింట్ సెక్రటరీ కే. శ్రీనివాస్ తదితరులు, పాల్గొన్నారు.

## ఎవరి ఓట్లు ఉంచాలనేదానిపై భాజపా కార్యాలయం నుంచి లిస్ట్: ప్రకాశ్‌రాజ్



హైదరాబాద్: ఓటర్ల జాబితాలో ఎవరి ఓట్లు ఉంచాలనేదానిపై భాజపా కార్యాలయం నుంచి లిస్ట్ వెళ్తోందని సినీనటుడు ప్రకాశ్‌రాజ్ (ౡతీఘఌఖంష్ర ౘఖఀ) ఆరోపించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'సర్'పై విమర్శలు చేశారు. "బతికుండగానే ఓట్లు తొలగించారని కొందరు చెబుతున్నారు. ఎవరి ఓట్లు ఉంచాలన్నది భాజపా కార్యాలయం నుంచి లిస్ట్ వెళ్తోంది. ఆ పార్టీ అనుకూల ఓట్లు మాత్రమే ఉంటున్నాయి. అక్రమ చొరబాటుదారులుంటే ఇన్నేళ్లుగా ఏం చేశారు? కేంద్రహోంశాఖ ఏం చర్యలు తీసుకుంది?" అని ప్రకాశ్‌రాజ్ ప్రశ్నించారు.

# పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు ప్రాధాన్యం..

**-ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ శ్రీదేవి**

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 03:**
అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడంతో పాటు పారదర్శకమైన, స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించడమే అధికారుల ప్రధాన లక్ష్యమని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్, మున్సిపల్ పరిపాలన శాఖ కార్యదర్శి శ్రీదేవి అన్నారు. శనివారం కామారెడ్డి కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హుడిని ఓటరుగా నమోదు చేయాలని సూచించారు. ఓటర్ల నమోదు, జాబితా శుద్ధీకరణలో అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, పౌరులు



సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా తరలివెళ్లిన వారి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం జాబితాను శుద్ధీకరించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులు, అభ్యంతరాలు, ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా ఓటు హక్కు పొందే యువతలో అవగాహన పెంచేందుకు పాఠశాలలు, కళాశాలల్లో ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ 78 శాతం పూర్తయినట్లు అధికారులు వివరించారు. పారదర్శకమైన, స్వచ్ఛమైన ఓటర్ల జాబితా ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని శ్రీదేవి పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి, అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో ప్రభాకర్, డిప్యూటీ శిక్షణ కలెక్టర్ రవితేజ, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు, విద్యార్థులు

# ముదిరాజ్‌లకు ప్రత్యేక నిధులు కేటాయించి జీవో 6 అమలు చేయాలి..

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 03:**
మహాసభ రాష్ట్ర పిలుపు మేరకు ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ముదిరాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొరివి నరసింహులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ముదిరాజ్‌ల సంక్షేమం కోసం



ప్రత్యేకంగా నిధులు కేటాయించి, జీవో నంబర్ 6ను వెంటనే అమలు చేయాలని కోరారు. ప్రతి గ్రామంలో ముదిరాజ్‌లకు మూడు ఎకరాల భూమిని కేటాయించి, చేపల పెంపకం, పండ్లు, పలారాల ద్వారా జీవనోపాధి పొందే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గ్రామాల్లోని చెరువులు, కుంటలకు మరమ్మతులు చేపట్టి, వాటి రిజిస్ట్రేషన్లను పూర్తి చేయాలని కోరారు. కొన్ని గ్రామాల్లో ముదిరాజ్‌లు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ, బెస్తవాళ్లు ఉన్నారనే కారణంతో కుంటలు, చెరువులలో ముదిరాజ్‌లకు సభ్యత్వం కల్పించడం లేదని ఆరోపించారు. చేప పిల్లలను చెరువులు, కుంటల్లో వదిలి వాటిపై ఆధారపడి జీవిస్తున్న ముదిరాజ్‌లపై ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ముదిరాజ్‌లు ఏర్పాటు చేసుకున్న చెరువులు, కుంటల్లో చేపల పెంపకానికి ప్రభుత్వం సహకరించాలని కోరారు. గ్రామాల్లో ఎక్కడ చెరువులు, కుంటలు ఉన్నా ముదిరాజ్ సోదరులు ధైర్యంగా చేపల పెంపకం చేసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని కొరివి నరసింహులు డిమాండ్ చేశారు.

# మండలం లో తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండా ఆవిష్కరణ

**- రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి**

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 03:**
జగదేవ్‌పూర్ : తెలంగాణ రక్షణ సేన పార్టీ మండల స్థాయి కార్యకలాపాలలో భాగంగా పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ముఖ్య అతిథిగా హాజరై, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అంతకు ముందు జగదేవపూర్ మండలం కు వచ్చిన రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టల యాదగిరి కి ఘన స్వాగతం పలికారు, ఎల్లమ్మ దేవాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు,బి అర్ ఎస్ పార్టీ నుంచి తెలంగాణ రక్షణ సేన పార్టీ లో చేరారు,పార్టీలో చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు,ఈ సందర్భంగా కొట్టాల యాదగిరి మాట్లాడుతూ..ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తెలంగాణ రక్షణ సేన నిరంతరం కృషి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. గత ప్రభుత్వాలు ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమయ్యాయని విమర్శించారు. ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఆమె, అధికారంలోకి వచ్చిన వెంటనే ఎల్కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అలాగే ప్రతి కుటుంబానికి నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందించే విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారు. మండల వ్యాప్తంగా పార్టీని మరింత ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు,తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ కార్యకర్తలు ప్రజలతో కలిసి పని చేస్తామని పేర్కొన్నారు, రాబోయే కాలంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ విజయం సాధించడం, కవిత ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు ఉచిత విద్యా, వైద్యం అందించడమే తమ ప్రధమ లక్ష్యమని అందుకోసం పోరాటాలు చేస్తామని, అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. మండలం పార్టీని బలోపేతం చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు , తెలంగాణ రక్షణసేన పార్టీ అధికారికంగా తన




ప్రధాన అంశాల్లో సామాజిక న్యాయం, మహిళలు, యువత, రైతులు మరియు ప్రజా సంక్షేమాన్ని ప్రస్తావిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు చందు, రమేష్,స్వామి, సత్తయ్య,ప్రశాంత్,రాములు,నరేష్,మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆపద సమయంలో అండగా నిలిచిన ఎమ్మెల్యే జారె

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 03:**



ప్రమాదంలో గాయపడిన పోలీస్ కానిస్టేబుల్‌ను స్వయంగా తన వాహనంలో ఆసుపత్రికి తరలించి సకాలంలో వైద్యం అందేలా చేసిన అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మానవత్వాన్ని చాటుకున్నారు సత్తుపల్లి నుంచి గండుగులపల్లికి వెళ్తున్న సమయంలో సరోజినాపురం వద్ద గండుగులపల్లి గ్రామానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ పిట్టల రాజు. ద్విచక్ర వాహన ప్రమాదానికి గురై గాయపడిన విషయాన్ని గమనించి వెంటనే స్పందించిన ఎమ్మెల్యే క్షతగాత్రుడిని తన వాహనంలో సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ఆసుపత్రిలో వైద్యులు ప్రథమ చికిత్స అందించే వరకు దగ్గరుండి పరిస్థితిని పరిశీలించారు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి సకాలంలో వైద్యం అందించడమే ముఖ్యమని భావించి ఎలాంటి ఆలస్యం లేకుండా ఆసుపత్రికి తరలించడం ద్వారా తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు ఆపదలో ఉన్న సమయంలో వెంటనే స్పందించి అండగా నిలవడమే ప్రజా ప్రతినిధిగా తన బాధ్యత అన్నట్లుగా ఆయన వ్యవహరించారు. అనంతరం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బొగ్గం రాజులగుంపు గ్రామానికి చెందిన జారె బాబురావు ను పరామర్శించారు ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సిబ్బందికి సూచించారు.

# అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు కావాలి

**- అశ్వారావుపేటలో జోరుగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు**

**- గ్రామ గ్రామానికి చేరుతున్న గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు ప్రచారం**

**- అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు కావాలి**

**- కాసాని చంద్రమోహన్, డాక్టర్ భూక్య ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో ముమ్మర నమోదు కార్యక్రమం**

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 03:**
: అశ్వారావుపేట మండలంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అర్హులైన పట్టభద్రులను ఓటరుగా నమోదు చేయించేందుకు బీఆర్‌ఎస్ శ్రేణులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాయి. బీఆర్‌ఎస్ నాయకులు కాసాని చంద్రమోహన్, డాక్టర్ భూక్య ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టారు. ఓటర్ల నమోదు ప్రక్రియను సులభతరం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు గ్రామ గ్రామాన, ఇంటింటికీ తిరుగుతూ పట్టభద్రులను కలిసి అవగాహన కల్పిస్తున్నారు. ఫారం-18 (గ్రాడ్యుయేట్స్) దరఖాస్తులను పూరింపజేసి, అవసరమైన ధ్రువపత్రాలను సేకరించి వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను పూర్తి చేయిస్తున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రతి అర్హుడైన పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని కోరారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైనదని, ప్రతి గ్రాడ్యుయేట్ తన హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. మండలంలోని ఊట్లపల్లి, వేదాంతపురం, కేశప్పగూడెం, జమ్మిగూడెం గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకంగా ఇంటింటి ప్రచారం నిర్వహించి ఓటర్ల నమోదును పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఊట్లపల్లి నుంచి తెలగారెడ్డి గంగాభవాని--బ్రహ్మాజీ, కోడూరు నాగు (మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు), కటుకూరి వెంకటేశ్వరరావు (మాజీ ఎంపీటీసీ), ప్రభాకర్ (బీఎల్‌ఓ), బండారి సుబ్బారావు, ఎపుగంటి వీరబాబు, తెల్లం హరిబాబు, గడ్డం పాండు, ఎపుగంటి లలితాదేవి, లక్ష్మీనారాయణ హాజరయ్యారు. జమ్మిగూడెం నుంచి మిద్దెన



కొండయ్య, జగపతి, మిద్దెన వెంకటేశ్వరరావు, సూరిబాబు, కేశప్పగూడెం నుంచి సర్పంచ్ బెతి భారతి--రాంబాబు, ముత్యాలరావు, బెతి పుల్లారావు, వేదాంతపురం నుంచి సర్పంచ్ భర్త తోట వెంకటస్వామి, మాజీ సర్పంచ్ సోమిని శివశంకర్ ప్రసాద్ నమోదును పర్యవేక్షించారు. అలాగే అశ్వారావుపేటకు చెందిన బీఆర్‌ఎస్ మాజీ టౌన్ అధ్యక్షులు సత్యవరపు సంపూర్ణ, గుడవర్తి వెంకటేశ్వరరావు, జుజ్జురపు శ్రీరామమూర్తి, మోహన్, నవీన్, రాంజీ, జక్కం బలరాం, రవి తదితరులు ప్రచార కార్యక్రమంలో భాగస్వాములై పట్టభద్రులు తమ ఓటరు నమోదును సకాలంలో పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# విద్యుత్ షాక్‌తో మహిళ మృతి..

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 03:**
భీంగల్ మండలం జాగిర్యాల్ గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై ఓ మహిళ మృతి చెందిన విషాద ఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నూకల మమత (43), భర్త మల్లేష్, తన కొత్త ఇంటిలో బల్బు ఫిట్టింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురైంది. తీవ్ర విద్యుత్ షాక్‌కు గురైన ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మమత మృతితో కుటుంబ సభ్యులు,



గ్రామస్తులు విషాదంలో మునిగిపోయారు. మృతురాలి భర్త మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీంగల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు భీంగల్ ఎస్సై తిరుపతి తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# మద్యం, కారు కోసం కన్నతల్లిపై దాడి..

**-ఇంటికి నిప్పంటించిన కొడుకు**

**త్రినెట్ న్యూస్, అక్టోబర్ 03:**
మద్యం తాగేందుకు, కొత్త కారు కొనుగోలు చేసేందుకు డబ్బులు ఇవ్వాలని కన్నతల్లిని వేధించిన ఓ యువకుడు.. ఆమెపై దాడి చేయడమే కాకుండా ఇంటికి నిప్పంటించిన ఘటన మెదక్ జిల్లా నిజాంపేట మండలం నస్కల్ గ్రామంలో చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నస్కల్ గ్రామానికి చెందిన గౌతమ్ రెడ్డి గత కొన్ని నెలలుగా మద్యం, కారు కొనుగోలు కోసం డబ్బులు ఇవ్వాలని తన తల్లి రజినిని వేధిస్తున్నాడు. ఆమె డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించడంతో తరచూ దూషిస్తూ, దాడి చేస్తూ చంపుతానని బెదిరించేవాడు.ఈ క్రమంలో అక్టోబర్ 2న మద్యం సేవించి ఇంటికి వచ్చిన గౌతమ్ రెడ్డి తల్లితో గొడవపడ్డాడు. అతడి వేధింపులు భరించలేక రజిని రక్షణ కోసం రామాయంపేటలోని తన స్నేహితురాలి ఇంటికి వెళ్లింది. తల్లి ఇంట్లో లేకపోవడంతో ఆగ్రహించిన గౌతమ్ రెడ్డి ఇంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. దీంతో ఇల్లు పూర్తిగా దగ్ధమైంది.బాధితురాలు రజిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు నిజాంపేట ఎస్ఐ రాజేష్ తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు నిందితుడు గౌతమ్ రెడ్డిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వెల్లడించారు




# అమ్మవారి దీవెనలే మనందరికీ శ్రీరామరక్ష

**- డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల**

**- పాల్వంచ లో పలు ప్రాంతాల్లో కర్ర పూజల్లో పాల్గొన్న కొత్వాల**

**త్రినెట్ న్యూస్, అక్టోబర్ 03:**




అమ్మల కన్న అమ్మ పెద్దమ్మ దీవెనలే మనందరికీ శ్రీరామరక్ష అని డిసిఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ కార్పొరేషన్ పరిధిలోని 1 వ డివిజన్ బొల్లోరిగూడెంలోజరిగిన కార్యక్రమాల్లో కొత్వాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. బొల్లోరిగూడెం లోని టీం ఆదిశక్తి దుర్గామాత కమిటీ, దుర్గాదేవి నవరాత్రుల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న నవరాత్రులకు పనులు ప్రారంభించేందుకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ నవరాత్రులు వైభవంగా జరుపుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, కార్పొరేటర్లు సీరపు సుగుణ, మాలంపాటి భవిత, కాంగ్రెస్ నాయకులు జాలె జానకిరెడ్డి, మహిపతి రామలింగం, కొండం వెంకన్న గౌడ్, సాదం రామకృష్ణారావు, వై. వెంకటేశ్వరరావు, చింతా నాగరాజు, బాడిశ శంకర్ రావు, మాలంపాటి కిరణ్, ఉత్సవాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# పేటకు బుల్లెట్ ట్రైన్ సౌకర్యం కల్పించాలి

**- టియుడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చలసాని శ్రీనివాసరావు**

**త్రినెట్ న్యూస్, అక్టోబర్ 03:**
సూర్యాపేట జిల్లాకు బుల్లెట్ ట్రైన్ సౌకర్యం కల్పించాలని కోరుతూ చేపడుతున్న డిమాండ్‌కు టియుడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చలసాని శ్రీనివాసరావు మద్దతు తెలిపారు. సూర్యాపేటను బుల్లెట్ ట్రైన్ మార్గంలో అనుసంధానం చేయడం ద్వారా జిల్లాకు రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడటంతో పాటు పారిశ్రామిక, వాణిజ్య, విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు



# గురు బ్రహ్మలు.. బి.ఎడ్ అధ్యాపకులు..

**-రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ విద్యావేత్తలకు 'గురు వందనం' పురస్కారాలు**

**త్రినెట్ న్యూస్, అక్టోబర్ 03:**
ఉపాధ్యాయ విద్యా రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న బి.ఎడ్ అధ్యాపకులను గుర్తించి సత్కరించేందుకు 'గురు వందనం -- రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ విద్యావేత్తల పురస్కారాలు--2026' కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో నిర్వహించారు.కామారెడ్డి రక్తదాతల సమూహ గౌరవ అధ్యక్షులు, ఎస్.వి. టీచర్ ప్లస్ ఈ-లెర్నింగ్ అకాడమీ ఫౌండర్ డాక్టర్ పిల్లమారి వేదప్రకాష్ ఆధ్వర్యంలో, ప్రిన్సిపల్స్ అసోసియేషన్ ఆఫ్ కాలేజెస్ ఆఫ్ ఎడ్యుకేషన్ (పేస్) ఇండియా, తెలంగాణ బి.ఎడ్ లెక్చరర్స్ అసోసియేషన్, తెలంగాణ ప్రైవేట్ బి.ఎడ్ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్, నిర్వాహక కమిటీ సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది.రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీలకు చెందిన 31 మంది అధ్యాపకులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించి పురస్కారాలు అందజేశారు. బి.ఎడ్ ఉపాధ్యాయ విద్యా రంగంలో విశిష్ట సేవలు, విద్యా ప్రమాణాల అభివృద్ధి, భవిష్యత్ ఉపాధ్యాయుల రూపకల్పన, ఉపాధ్యాయ విద్యా వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తున్న వారిని గుర్తించి గౌరవించడమే కార్యక్రమం ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో ప్రొఫెసర్ వి. సుధాకర్, చైర్ ప్రొఫెసర్, చాణక్య యూనివర్సిటీ, బెంగళూరు; డాక్టర్ పి. శంకర్, అసోసియేట్ ప్రొఫెసర్, నిప న్యూఢిల్లీ; ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్, డైరెక్టర్, డైరెక్టరేట్ ఆఫ్ అకడమిక్ ఆడిట్, తెలంగాణ యూనివర్సిటీతో పాటు ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన డాక్టర్ లలిత, డాక్టర్ సునీత, పలువురు ప్రముఖ విద్యావేత్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఉపాధ్యాయ విద్యా రంగంలో అంకితభావం, విద్యా నాయకత్వం, నూతన



ఆవిష్కరణలు, వృత్తిపరమైన నైపుణ్యం, విశిష్ట సేవలను గుర్తిస్తూ 'గురు వందనం' కార్యక్రమాన్ని నిర్వహించడంఅభినందనీయమన్నారు. కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ వేదప్రకాష్‌ను అభినందించి సన్మానించారు.కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రంలోని బి.ఎడ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, బి.ఎడ్ లెక్చరర్లు, ఉపాధ్యాయ విద్యావేత్తలు, విద్యా పరిపాలకులు, విద్యారంగ ప్రముఖులు పాల్గొన్నారు.

# రూ.1.93 కోట్ల గంజాయి కేసులో మరో ముగ్గురిపై పీడీ యాక్ట్..

**త్రినెట్ న్యూస్, అక్టోబర్ 03:**
రూ.1.93 కోట్ల విలువైన 387.128 కిలోల గంజాయి అక్రమ రవాణా కేసులో మరో ముగ్గురు నిందితులపై పీడీ యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ తెలిపారు. దీంతో ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం ఏడుగురిపై పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.ఈ కేసులో 2026 జూన్ 20న ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి మహారాష్ట్రలోని నాసిక్‌కు గంజాయి తరలిస్తున్నట్లు దేవునిపల్లి పోలీసులకు సమాచారం అందింది. ఎస్పీ ఆదేశాలతో ప్రత్యేక బృందాలు జాతీయ రహదారి-44పై తనిఖీలు చేపట్టాయి. క్యాసంపల్లి శివారులోని రాయల్ ధాబా సమీపంలో అనుమానాస్పదంగా కనిపించిన అశోక్ లేలాండ్ బడా దోస్త్ వాహనాన్ని తనిఖీ చేయగా, పైభాగంలో



పనసపండ్లు ఉంచి వాటి కింద సంచుల్లో గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహనం నుంచి 387.128 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.1,93,56,400గా పోలీసులు తెలిపారు.తాజాగా పీడీ యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ అయిన వారిలో ఇందల్వాయి మండలం తిర్మన్‌పల్లికి చెందిన షేక్ కరీముల్లా ఏ షేక్ కరీం (41), గైని సుభాష్ (35), షేక్ రహీమ్ (59) ఉన్నారు. ఈ కేసులో ఇప్పటికే నలుగురిపై పీడీ యాక్ట్ అమలు చేయగా, తాజాగా మరో ముగ్గురిపై చర్యలు తీసుకోవడంతో మొత్తం ఏడుగురిపై పీడీ యాక్ట్ అమలైంది.మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, నిల్వలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా ప్రత్యేక నిఘా, వాహనాల తనిఖీలు, నాకాబందీలు, ప్రత్యేక ఆపరేషన్లు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. డ్రగ్స్ అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్, పోలీస్ అధికారులకు లేదా డయల్ 112కు సమాచారం ఇవ్వాలని, సమాచారదాతల వివరాలు గోప్యంగా ఉంచుతామని ప్రజలకు సూచించారు.

# సహకార సంఘాల బలోపేతానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుంది

**- సహకార వ్యవస్థతో రైతులకు మరిన్ని అవకాశాలు**

**- ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం**

**- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**

**త్రినెట్ న్యూస్, అక్టోబర్ 03:**
కాపులకనపర్తి సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించిన ఎరువుల గోదాం మరియు షాపింగ్ కాంప్లెక్స్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సంగెం మండలం రామచంద్రపురం గ్రామంలో ఎఫ్ ఎస్ సి ఎస్ కాపులకనపర్తి సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించిన 250 మెట్రిక్ టన్నుల ఎరువుల గోదాం మరియు షాపింగ్ కాంప్లెక్స్ ను జిల్లా కలెక్టర్ సత్య శారద తో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాపులకానిపర్తి సొసైటీ అంటే తనకు ప్రత్యేక గౌరవం ఉందని అన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సహకార సంఘాల బలోపేతానికి ప్రత్యేకంగా కృషి చేస్తోందని తెలిపారు.సహకార వ్యవస్థ ద్వారా రైతుల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి మరిన్ని అవకాశాలు లభిస్తాయని అన్నారు. సొసైటీ రైతులకు ప్రత్యేకంగా 1907 మందికి 14.77 కోట్ల రైతు రుణమాఫీ చేశామని అన్నారు.రైతుల ప్రయోజనాల కోసం పనిచేస్తున్న సహకార సంఘాలను బలోపేతం చేయడంతో పాటు, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు.స్థానిక నాయకత్వం ఎంత బలంగా పనిచేస్తే, ప్రభుత్వం నుంచి అంతే స్థాయిలో ప్రోత్సాహం అందుతుందని అన్నారు.రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉండేలా ఈ గోదాం, సొసైటీ కార్యకలాపాలకు ఉపయోగపడేలా షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయడం అభినందనీయమని,సహకార సంఘాల ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందేలా



ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. మహిళల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తుందని, రాష్ట్రంలో ప్రథమంగా మహిళలతో పరకాల ఇందిరా మహిళా డైరీ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఒ నీరజ, జిల్లా వ్యవసాయ అధికారి విజయభాస్కర్, సొసైటీ చైర్మన్ దొమ్మటి సంపత్, స్థానిక సర్పంచ్ పులి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బండారిగుంపులో విద్యుత్ సౌకర్యాల కల్పనకు శ్రీకారం

**త్రినెట్ న్యూస్, అక్టోబర్ 03:**
ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మీటర్ల పంపిణీ : మండలంలోని రెడ్డిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని బండారిగుంపులో విద్యుత్ సౌకర్యాల విస్తరణకు చర్యలు చేపట్టారు. సర్పంచ్ ఉమ్మల వెంకటరమణ, ఉప సర్పంచ్ దుర్గా రెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీంతో గ్రామంలో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడుతుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.అలాగే ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు విద్యుత్ మీటర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని ప్రజాప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో దానేలు రెడ్డి, బొల్లి వెంకటేష్ రెడ్డి, కనితి



ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
ఆదివారం అక్టోబర్ 04, 2026
www.trinetnews.com

# కల్యాణలక్ష్మి--షాదీ ముబారక్ పథకాలకు 12 ఏళ్లు..

## కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్

- కేసీఆర్ పథకాలు ప్రజల గుండెల్లో.. కాంగ్రెస్ హామీలు కాగితాలపైనేనా
- హామీలే తప్ప అమలు లేదు..” హామీలతో గద్దెనెక్కి.. పథకాలను మరిచారు!..
- కాంగ్రెస్ ప్రభుత్వంపై చింతా ప్రభాకర్ తీవ్రస్థాయిలో ఫైర్
- ఇది పాలన కాదు.విధ్వంసానికి తొలి మెట్టు రేవంత్ సర్కార్‌పై చింతా ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ




శ్రేణులతో కలిసి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాలాభిషేకం చేశారు.

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ప్రశంసలు కురిపించారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలను కేసీఆర్ అమలు చేశారని అన్నారు. ముఖ్యంగా పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్



పథకాలను ప్రవేశపెట్టారని పేర్కొన్నారు.

కేసీఆర్ సుపరిపాలనను చూసి ప్రజలు ఆకర్షితులయ్యారని, అయితే ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని చింతా ప్రభాకర్ విమర్శించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌తో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ



హామీని నెరవేర్చలేదని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో విధ్వంసం జరుగుతోందని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, కేసీఆర్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ప్రజలు భావిస్తున్నారని అన్నారు. రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా గత 12 ఏళ్లలో లక్షలాది కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిందని, ఈ పథకాల ద్వారా పేద కుటుంబాలకు అండగా నిలిచిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని చింతా ప్రభాకర్ అన్నారు. కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాల ద్వారా 12 ఏళ్లలో 16.78 లక్షల కుటుంబాలు లబ్ధి పొందాయి అని అన్నారు.
కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, డాక్టర్ శ్రీహరి, ఎస్‌కే రషీద్, మల్ల గౌడ్, మాజీ జడ్పీటీసీ కొండల్‌రెడ్డి, చిల్వేరి ప్రభాకర్, వేణుగోపాలస్వామి, మండల పార్టీ అధ్యక్షులు చక్రపాణి, విఠల్, మధుసూదన్‌రెడ్డి, కౌన్సిలర్లు కొత్తపల్లి నాని, జలంధర్, పొన్న దశరథ్‌రెడ్డి, నాయికోటి నవీన్, శ్రీకాంత్, జాఫర్, నాయకులు శ్రావణ్‌రెడ్డి, రాజేందర్‌నాయక్, గోవర్ధన్‌రెడ్డి, రుక్మోద్దీన్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ

## మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హోటల్‌లో యువ వైద్యురాలు (పిజి మెడికో) కోమటి సృజన దారుణ హత్య -- నిందితుడి కోసం గాలింపు చర్యలు ముమ్మరం.

హన్మకొండలో పీజీ పీడియాట్రిక్స్ మొదటి సంవత్సరం చదువుతున్న సంగారెడ్డి జిల్లాకు చెందిన 27 ఏళ్ల యువ వైద్యురాలు కోమటి సృజన (తండ్రి భూమయ్య) హత్యకు గురైన సంఘటనపై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.
మృతురాలు ఈ ఏడాది సెప్టెంబర్ 30న హైదరాబాద్‌కు వచ్చినప్పటి నుండి కుటుంబ సభ్యులకు అందుబాటులో లేకుండా పోయింది. తండ్రి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు.. బాధితురాలి మొబైల్ సిగ్నల్ మరియు లొకేషన్ ఆధారంగా విచారణ చేపట్టారు. ఈ క్రమంలో మియాపూర్‌లోని ‘హోటల్ గ్రాండ్ బ్రోచిల్’ (రూమ్ నంబర్ 502) లో ఆమె ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు సిబ్బందితో కలిసి వెళ్లి స్పేర్ కీతో గదిని తెరిచి చూడగా, సృజన మంచంపై మృతి చెంది విగతజీవిగా పడి ఉంది. మృతదేహం అప్పటికే డీకంపోజ్ (కుళ్లిపోయిన) స్థితిలో ఉన్నట్లు గమనించడం జరిగింది.
పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలిన విషయాలు:
– పక్కా పథకం ప్రకారం హత్య: నిందితుడు రవికుమార్ పక్కా స్కెచ్‌తో సృజనకు సంబంధించిన బంగారు గొలుసు



ఇస్తానని నమ్మబలికి ఆమెను హోటల్‌కు రప్పించినట్లు దర్యాప్తులో వెల్లడైంది.
– హత్యా విధానం: హోటల్ గదిలో నిందితుడు రవికుమార్.. సృజన ముఖంపై దిండుతో గట్టిగా నొక్కి, ఊపిరాడకుండా చేసి దారుణంగా హత్య చేసినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు.
– నేపథ్యం: గతంలో సృజన, రవికుమార్ ఇద్దరూ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమై ప్రేమించుకున్నట్లు తెలుస్తోంది. అయితే కొన్ని కారణాల వల్ల గత ఆరు నెలలుగా రవికుమార్‌ను సృజన పూర్తిగా దూరం పెట్టింది. ఈ కక్షతోనే నిందితుడు ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు అనుమానిస్తున్నారు.
ప్రస్తుత చర్యలు:
ఘటన జరిగిన అనంతరం నిందితుడు రవికుమార్ తన మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి అక్కడి నుండి పరారయ్యాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా/గాంధీ ఆసుపత్రికి తరలించి, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.
మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రవికుమార్‌పై హత్య మరియు ఇతర పలు సెక్షన్ల కింద మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశాము. హోటల్‌లోని సీసీటీవీ ఫుటేజీ ని మరియు కాల్ డేటాను విశ్లేషిస్తున్నాము. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి గాలింపు చర్యలను ముమ్మరం చేశాము. త్వరలోనే నిందితుడిని అరెస్ట్ చేస్తామని వెల్లడిస్తున్నాము.
– ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, మియాపూర్ పి.ఎస్.

## సదాశివపేట సిద్ధాపూర్ 7వ వార్డులో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని

సదాశివపేట సిద్ధాపూర్ గ్రామం 7వ వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్థులు ఈరోజు స్థానిక తహశీల్దార్ గారికి వినతి పత్రం సమర్పించారు కాంగ్రెస్ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డిమాట్లాడుతూ, వార్డులో చనిపోయిన వారి అంత్యక్రియలను గౌరవప్రదంగా నిర్వహించడానికి సరైన శ్మశాన వాటిక స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. స్థలం లేకపోవడం వల్ల విధిలేని పరిస్థితుల్లో సొంత పొలాలు, చేన్లలోనే అంత్యక్రియలు జరపాల్సి వస్తోందని వారు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.
కావున, ప్రభుత్వం వెంటనే స్పందించి 7వ వార్డు పరిధిలో




శ్మశాన వాటిక ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ భూమిని కేటాయించి, గ్రామ ప్రజల సమస్యను తీర్చాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొల్ల కిష్టయ్య ఆయూబ్ పాషా రామ్ రెడ్డి మంగలి



ఆంజనేయులు బంజ శంకరయ్య బోయిని శ్రీనివాస్ అనంతరం గౌడ్ మున్నూరు లక్ష్మయ్య జంగం చంద్రశేఖర్ చాకలి సుధాకర్ అనిత, ఇ.రెడ్డి పాల్గొన్నారు.

## ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు సంగారెడ్డి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్

- ఉచిత స్టడీ మెటీరియల్‌తో పాటు అనుభవజ్ఞులైన బోధనా సిబ్బందిచే శిక్షణ, ఫిజికల్ ట్రైనింగ్.
- అర్హత కలిగిన అభ్యర్థులు అక్టోబర్ 3 నుంచి 7 వరకు సమీప పోలీస్ స్టేషన్లలో దరఖాస్తు చేసుకోవాలి.
- ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్

పోలీసు ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు జిల్లా కలెక్టర్ ప్రీతిక్ జైన్ ఐఏఎస్, జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ తెలిపారు.
జిల్లా వ్యాప్తంగా సంగారెడ్డి, జహీరాబాద్, అందోల్ కేంద్రాల్లో ఈ ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, శిక్షణ తరగతులు అక్టోబర్ 10, 2026 నుంచి ప్రారంభమవుతాయన్నారు. ఈ కోచింగ్‌లో భాగంగా అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ అందించడంతో పాటు, అనుభవజ్ఞులైన బోధనా సిబ్బందిచే పోటీ పరీక్షలకు సంబంధించిన అంశాలపై శిక్షణ, శారీరక దారుఢ్య పరీక్షలకు సిద్ధమయ్యేలా ఫిజికల్ ట్రైనింగ్ కూడా అందించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు అక్టోబర్ 3 నుంచి



అక్టోబర్ 7, 2026 వరకు సంబంధిత పోలీస్ స్టేషన్లలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు.



పోలీసు ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న యువతను ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతో అభ్యర్థులకు అవసరమైన మార్గదర్శకత్వం, ఉచిత స్టడీ మెటీరియల్, నాణ్యమైన బోధన, ఫిజికల్ ట్రైనింగ్ అందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిమచడం జరుగుతుందని, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణతో శిక్షణ పొందుతూ పోలీసు ఉద్యోగాల సాధనకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు.

### అక్టోబర్ 4న ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే మాల విద్యార్థుల నిరుద్యోగుల ఉద్యోగుల సభకు మద్దతు ఇస్తున్నట్లు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోపోజు రమేష్ బాబు ప్రకటన

రోస్టర్ విధానం వలన నష్టపోతున్న మాల 26 కులాలకు న్యాయం చేయాలని మాల విద్యార్థులకు విద్యాసంస్థల్లో సీట్లు రావట్లేదు మాల నిరుద్యోగులకు ఉద్యోగాలు రావట్లేదు రిజర్వేషన్ ఉండి కూడా లేనట్టుగానే ఉంది బాబా సాహెబ్ అంబేద్కర్ గారు రాజ్యాంగం ద్వారా కల్పించిన రిజర్వేషన్లు మాలలకు అందే విధంగా చూడాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ అక్టోబర్ 4 ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్



ఆడిటోరియంలో జరిగే మాల విద్యార్థుల సభకు తెలంగాణ రాష్ట్రంలోని మాల మహానాడు నాయకులు కార్యకర్తలు మాల విద్యార్థులు మరియు మాలలు అత్యధిక సంఖ్యలో పాల్గొని మాల విద్యార్థుల సభను విజయవంతం చేయాలని మాల మహానాడు పిలుపునిస్తుంది
జై భీమ్
జై మాల
జై భారత్

## 5వ తెలంగాణ బ్యాడ్మింటన్ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో సంగారెడ్డి జిల్లాకు బంగారు, కాంస్య పతకాలు.

- పతకాలు సాధించిన పోలీసు సిబ్బందిని శాలువాతో సత్కరించి అభినందించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్





తెలంగాణ పోలీస్ అకాడమీ, హైదరాబాద్‌లో నిర్వహించిన 5వ తెలంగాణ బ్యాడ్మింటన్ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో సంగారెడ్డి జిల్లా పోలీసు సిబ్బంది ప్రతిభ కనబరిచారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన హెడ్ కానిస్టేబుల్ ఈ.డి. సజీవ్ 50o వయస్సు విభాగంలో బంగారు పతకం సాధించగా, మహిళల ఓపెన్ డబుల్స్ విభాగంలో శ్రావ్య, ధరణిలు కాంస్య పతకం సాధించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్, పతకాలు సాధించిన హెడ్ కానిస్టేబుల్ ఈ.డి. సజీవ్, శ్రావ్య, ధరణిలను శాలువాతో సత్కరించి అభినందించారు. క్రీడల్లో ప్రతిభ కనబరచి సంగారెడ్డి జిల్లా పోలీసు శాఖకు గౌరవం తీసుకురావడం అభినందనీయమని అన్నారు. పోలీసు సిబ్బంది విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ ప్రతిభను చాటుతూ జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేలా క్రీడాకారులను ప్రోత్సహించారు.
**ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఏఆర్ డిఎస్పీ నరేందర్ ఉన్నారు.**

## కౌన్సిలర్ చొరవతో ‘ఓం జెండా’ పునర్నిర్మాణానికి శ్రీకారం



జిన్నారం మున్సిపల్ 5 వ వార్డ్ పెద్దమగూడెం లో స్థానిక కౌన్సిలర్ శిల్ప నాగరాజు చొరవతో ఇటీవల దెబ్బతిన్న ‘ఓం జెండా’ పునర్నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. ఈ విషయాన్ని కౌన్సిలర్ అధికారులు, పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లగా.. మున్సిపల్ చైర్మన్ జనార్ధన్ మరియు కమిషనర్ నరేందర్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ధ్వంసమైన ఓం జెండాను త్వరలోనే పూర్తిస్థాయిలో పునర్నిర్మిస్తామని వారు హామీ ఇచ్చారు. సమస్యపై వేగంగా స్పందించిన కౌన్సిలర్‌తో పాటు హామీ ఇచ్చిన చైర్మన్, కమిషనర్లకు స్థానిక ప్రజలు, భక్తులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జనార్ధన్,శ్రీనివాస్ రెడ్డి. శ్రీనివాస్ యాదవ్. మంద రమేష్. బండి శ్రీకాంత్. శ్రీధర్ గౌడ్. ప్రవీణ్.నాగరాజు. నిఖిల్ గౌడ్ మున్సిపల్ అధికారులు రామ్ చరణ్ ,మాణిక్యం, మల్లికార్జున్. గ్రామస్తులు సత్తన్న గారి మల్లేష్,రాములు, సత్తయ్య, ఆంజనేయులు,గుర్రాల దాస్, బిక్షపతి, సత్యనారాయణ,రాజు, మల్లేష్ పాల్గొన్నారు

## ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి సంఘం జిల్లా అధ్యక్షుడు

### బందు వెంకన్న



తొర్రూరు మండలం వెలికట్టె గ్రామానికి చెందిన బందు వెంకన్న ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గడిపే రాములు ఈ విషయాన్ని తెలిపారు. ఆయన మాట్లాడుతూ, భారతరత్న డా. బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా పేదలకు నీరు తాగే హక్కు, ఓటు హక్కు, చదువుకునే హక్కు, ఉద్యోగ, రాజకీయ హక్కులను కల్పించారని అన్నారు. నిజమైన ఎస్సీ, ఎస్టీ కేసుల్లో ఎంతటి ధనవంతుడైనా తప్పు చేస్తే శిక్ష అనుభవించాలని, కేసులను నిజాయితీగా పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు బందు వెంకన్న మాట్లాడుతూ, తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని, ఎస్సీ, ఎస్టీ కేసులను నిర్వీర్యం కాకుండా చట్ట ప్రకారం దోషులకు శిక్ష పడేలా పోరాడతానని, సంఘ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

## పోతంగల్ మండలంలో వరి కోతలు ప్రారంభం



పోతంగల్ మండలంలో ప్రస్తుత సీజన్ వరి కోతలు శుక్రవారంప్రారంభమయ్యాయి. మండలంలో మొత్తం 13,888 ఎకరాల్లో వరి సాగు చేయగా, పోతంగల్ గ్రామంలో శుక్రవారం సుమారు 15 ఎకరాల్లో కోతలు చేపట్టారు. 30 శాతం తేమ ఉన్న పచ్చి వడ్లకు ప్రైవేట్ రైస్ మిల్లర్లు క్వింటాల్‌కు రూ.3,500 చెల్లిస్తున్నారని, ఎకరాకు 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు. మంచి ధర, దిగుబడితో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యవసాయ అధికారి నిశిత వరి పొలాన్ని సందర్శించి దిగుబడి, తేమ శాతం, ధర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి అరుణ్, రైతులు పాల్గొన్నారు.

## ఉమ్మడి కోటగిరి విజ్ఞాన్ ప్రెస్ క్లబ్ కు ఘన సన్మానం



కోటగిరి మండల కేంద్రంలో విజ్ఞాన్ ప్రెస్ క్లబ్ సభ్యులకు డాక్టర్ హకీమ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హకీమ్ మాట్లాడుతూ, ప్రెస్ క్లబ్ సభ్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను వార్తల ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారని కొనియాడారు. ప్రెస్ అంటే ప్రజలకు ఎంతో నమ్మకమని, ఏ వార్త అయినా క్షణాల్లో ప్రజలకు చేరవేసేలా పని చేస్తున్నారని అన్నారు.
ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గైని గజానంద్, ఉపాధ్యక్షుడు సమీర్, కార్యదర్శి మోరే జీవన్, మాజీ అధ్యక్షులు శ్రీనివాస్, నరసింహులు, సింహాద్రి, శంకర్, భీమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## డీ జే ఎఫ్ బోధన్ డివిజన్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో లైన్స్

బోధన్ డివిజన్ గౌరవాధ్యక్షులు అశోక్ కామ్ లే అధ్యక్షులు గంధం రాజేష్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం జరిగింది అమెరికా సంవత్సరాల నుంచి డి జె ఎఫ్ దళిత బహుజన విలేకరుల సమస్యల మీద పోరాడుతుందని అన్నారు. ఇకపై కూడా పోరాడుతుందని తెలిపారు.



## బీఆర్ఎస్ పార్టీలో భారీ చేరికలు

పోతంగల్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు బీఆర్ఎస్ పార్టీలో



చేరినట్లు మండల నాయకులు సూదం నవీన్ తెలిపారు. బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, పరిశీలకులు తోట ఆగయ్య ఆధ్వర్యంలో ఆయన నివాసంలో ఈ చేరికలు జరిగాయని పేర్కొన్నారు. సుంకిని, కొల్లూరు, పోతంగల్ గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలకు బాజిరెడ్డి గోవర్ధన్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో బాన్సువాడలో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని, కష్టపడే వారికి తప్పక గుర్తింపు ఉంటుందని, రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆయన అన్నారు. నియోజకవర్గంలో భారీ చేరికలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు ఎలమంచిలి శ్రీనివాసరావు, తేల్ల రవికుమార్, మోరే కిషన్, సూదం నవీన్, గాండ్ల మధు, ఎజాజ్, ఆరిఫ్, మాజీ ఎంపీటీసీ సాయిలు, అఫ్రోజ్, కురుమ సాయిలు, ఇమ్రాన్, ఆటో యూనియన్ అధ్యక్షుడు సద్దాం, జలాల్ తదితరులు పాల్గొన్నారు.

## తొర్రూర్ విద్యుత్ సరఫరాలో అంతరాయం



తొర్రూరు సబ్ స్టేషన్ లో విద్యుత్ సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు మరమ్మత్తు పనులు చేపడుతున్న నేపథ్యంలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని డి ఈ కృష్ణ తెలిపారు. తొర్రూరు పట్టణం, చింతలపల్లి, కొమనపల్లి, సొమ్ల తండా, దుబ్బ తండా, పాలకేంద్రం తదితర ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరానిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు వినియోగదారులు సహకరించాలని కోరారు

## నూతన ఇంచార్జి ఎంపీఓ శ్రీనివాస్‌కు ఘన సన్మానం



మరిపెడ మండలం నేతవాత్ పర్కజాల్ తండా గ్రామపంచాయతీలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభకు నూతన ఇంచార్జి ఎంపీఓ శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ బానోత్ కొండయ్య, అంగన్‌వాడీ టీచర్ బానోత్ కవిత ఆయనను శాలువాతో సన్మానించారు.
గ్రామ అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు కోరారు. మౌలిక వసతుల కల్పనకుప్రాధాన్యమివ్వాలని, అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, అంగన్‌వాడీ, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి




### డీ ఐ ఈ వో సులోచనారాణి

నడిగూడెం: ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని సూర్యాపేట జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి సులోచనారాణి కోరారు.
శనివారం నడిగూడెం కేఎల్ఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత యూనిఫాంలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ ఏడాది ఇంటర్ విద్యార్థులకు రాత పుస్తకాలు, యూనిఫాంలు, షూస్, బెల్ట్, ఐడీ కార్డు, బ్యాగులు పంపిణీ చేస్తున్నామని, త్వరలో బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం కూడా అందిస్తామని తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు హాజరై ఉన్న వనరులను సద్వినియోగంచేసుకోవాలని సూచించారు. ఈ
కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి. విజయనాయక్, అధ్యాపకులు డాక్టర్ జాన్ పాషా, కృష్ణ, మహేష్, ఈశ్వర్, నాగరాజు, శ్రీనివాసరావు, డాక్టర్ కోళ్ల శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, తేజశ్రీ, రజిత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## రెండు లక్షల ఎల్ ఓ సి చెక్కు అందజేత



### ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

వలిగొండ మండలం సుంకిశాల గ్రామానికి చెందిన కొమ్మగాని కలమ్మకు హాస్పిటల్ ఖర్చుల నిమిత్తంరూ.2 లక్షల ఎల్ఓసీ చెక్కును భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అందజేశారు ఈ కార్యక్రమంలో వలిగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బత్తిని సహదేవ్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు చెరుకు శివయ్య గౌడ్, చిలుగూరు సత్తిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## బిఆర్ఎస్ పార్టీలో భారీ చేరికలు,

### కాంగ్రెస్ పై హరీష్ రావు ఫైర్

### రేవంత్ రెడ్డిది తడిగుడ్డతో గొంతు కోసే మనస్తత్వం

నర్సాపూర్ మండలం కాగాజీ మద్దూర్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది తడిగుడ్డతో గొంతు కోసే మనస్తత్వమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శించారు. శనివారం నర్సాపూర్ మండలం కాగజ్ మద్దూర్ లో నర్సాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన చేరికల కార్యక్రమంలో కాగజ్ మద్దూర్, నస్తాయిపల్లి, గూడెంగడ్డ, కొండాపూర్ గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ లో చేరారు. వారికి హరీష్ రావు, సునీతా రెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. హరీష్ రావు మాట్లాడుతూ.. మూడేళ్లయినా 6 గ్యారెంటీలను అమలు చేయలేదు. పింఛన్లు పెంచుతామని మోసం చేశారు. ఎల్ నినో పై శాస్త్రవేత్తలు 6 నెలల ముందే హెచ్చరించినా ప్రభుత్వం ముందుచూపు లేకుండా వ్యవహరించింది. – బీఆర్ఎస్ హయాంలో యాసంగిలోనూ 24 గంటల కరెంటు ఇస్తే, ఇప్పుడు వానాకాలంలోనూ 6–7 గంటలు ఇవ్వడం లేదు. ఇది కాలం తెచ్చిన కరువు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరువు. మనుషులు లేని ఫ్యూచర్ సిటీకి కోట్లతో 6 లైన్ల రోడ్లు వేస్తూ, జనం ఉన్న గ్రామాల రోడ్లను గుంతలమయంగా వదిలేశారు. ప్రజలు కాంగ్రెస్ పట్ల విసుగు చెంది మళ్లీ కేసీఆర్ పాలన కోరుకుంటున్నారని అన్నారు. ఎమ్మెల్యే సునీతా రెడ్డి మాట్లాడుతూ ఇతర పార్టీల నుంచి వలసలు పెరగడమే ఇందుకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో మాజీ లేబర్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ దేవేందర్ రెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ చంద్రగౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ బాబ్యా నాయక్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, పట్టణ అధ్యాషుడు పంబాల బిక్షపతి, కౌన్సిలర్లు బాల్ రెడ్డి, బుల్లెట్ రాజు, తదితరులు పాల్గొన్నారు.





## బొల్లారం ఆర్మ్స్ చోరీ కేసులో 8 మంది అరెస్ట్

### బ్యాంకులు, జ్యువెలరీ షాపులు, సంపన్నులను టార్గెట్ చేసేందుకు కుట్ర

### మాజీ సైనికుడు సహా 8 మందిని అరెస్ట్ చేసిన మల్కాజ్‌గిరి పోలీసులు







మల్కాజ్‌గిరి : బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలోని 20వ బెటాలియన్ మద్రాస్ రెజిమెంట్ కోటే, మ్యాగజైన్ నుంచి భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి చోరీకి గురైన కేసును మల్కాజ్‌గిరి పోలీసులు ఛేదించారు. ఈ కేసులో మాజీ హవల్దార్‌తో పాటు మొత్తం ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి తెలిపారు. ఆగస్టు 31న బొల్లారంలోని 20 బెటాలియన్ మద్రాస్ రెజిమెంట్‌లో కోటే, మ్యాగజైన్ తాళాలు పగులగొట్టి ఉండటాన్ని సిబ్బంది గుర్తించారు. తనిఖీ చేయగా 4 ఏకే–203 రైఫిళ్లు, ఒక ఇన్సాస్ రైఫిల్, ఆరు 9ఎంఎం పిస్టళ్లు, ఒక సివిల్ పిస్టల్, మ్యాగజైన్లు, బైనాక్యులర్లు, భారీగా తుపాకీ రౌండ్లు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ ఘటనపై బొల్లారం పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 207/2026 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రధాన నిందితుడి అరెస్ట్‌సెప్టెంబర్ 11న అందిన పక్కా సమాచారంతో మల్కాజ్‌గిరి పోలీసులు, తెలంగాణ పోలీసుల ఇతర విభాగాల సహకారంతో ప్రధాన నిందితుడు లిఉప్పుతొల్ల మల్లేశ్ ఏ రాజు (ూ1)లిను అదుపులోకి తీసుకున్నారు. అతని తండ్రి నివాసంలో దాచిన చోరీకి గురైన ఆయుధాలు, మందుగుండు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపారు. అనంతరం పోలీస్ కస్టడీకి అనుమతి లభించడంతో సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 1 వరకు విచారణ కొనసాగించారు. బ్యాంకులు, నగల దుకాణాలే లక్ష్యంపోలీసుల దర్యాప్తు ప్రకారం, ప్రధాన నిందితుడు తన బంధువు మల్లికార్జున్ (ూ7), స్నేహితుడు లినిరంజన్ (ూ8)లితో కలిసి బ్యాంకులు, నగల దుకాణాలు, సంపన్నులను లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడాలని ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడైంది. ఆయుధాలను ఉపయోగించి భారీ మొత్తంలో డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో పశ్చిమ బెంగాల్‌కు చెందిన లిఅవి డే ఏ ఒబి (ూ5), బిర్బల్ షా (ూ6)లిలను సంప్రదించినట్లు పోలీసులు తెలిపారు. గతంలో మద్రాస్ రెజిమెంట్‌లో పనిచేసిన శేషులు (ూ2), వినోద్ కుమార్ (ూ3), ప్రవీణ్ (ూ4) సహకారంతో కోటే, మ్యాగజైన్ తాళాలు పగులగొట్టి ఆయుధాలు, మందుగుండు సామగ్రిని చోరీ చేసినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. ఒక్కో ఆయుధానికి ధర నిర్ణయంపోలీసుల ప్రకారం, చోరీ చేసిన ఆయుధాలను కొనుగోలు చేసేందుకు ూ5 ఒప్పుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. పిస్టల్‌కు సుమారు రూ.3 లక్షలు, లాంగ్ వెపన్‌కు రూ.5 లక్షలు, మందుగుండు సామగ్రికి అదనంగా డబ్బు చెల్లిస్తానని చెప్పినట్లు పోలీసులు తెలిపారు. 2022లోనే అక్రమ ఆయుధం కొనుగోలు దర్యాప్తులో మరో విషయం వెలుగులోకి వచ్చింది. 2022లో బారక్‌పూర్, కోల్‌కతాలో బెటాలియన్ పోస్టింగ్‌లో ఉన్న సమయంలో ూ1కు బిర్బల్ షా ద్వారా అవి డే ఏ ఒబితో పరిచయం ఏర్పడినట్లు పోలీసులు తెలిపారు. వారి ద్వారా రూ.10,000 చెల్లించి ఒక దేశీయ తుపాకీ (తపంచా), ఒక లైవ్ రౌండ్ కొనుగోలు చేసినట్లు వెల్లడైంది. ఆ ఆయుధాన్ని అనంతరం తన తండ్రి ఇంట్లోని మొదటి అంతస్తులో దాచినట్లు పోలీసులు తెలిపారు. సెప్టెంబర్ 23న నిర్వహించిన సీజ్ పంచనామా ద్వారా ఆ తపంచాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆయుధాలుఏకే–203 రైఫిళ్లు -- 4ఏకే–203 మ్యాగజైన్లు -- 5ఇన్సాస్ రైఫిల్ -- 1ఇన్సాస్ మ్యాగజైన్లు -- 3,9ఎంఎం పిస్టళ్లు -- 6,9ఎంఎం పిస్టల్ మ్యాగజైన్లు -- 12,6.35 బోర్ సివిల్ పిస్టల్ -- 1 బైనాక్యులర్లు -- 3, 9ఎంఎం పిస్టల్ రౌండ్లు -- 1,156 ఏకే–203 రౌండ్లు -- 720 ఇన్సాస్ రౌండ్లు -- 36 మొబైల్ ఫోన్లు -- 5 నిందితుల వివరాలు A1 -- ఉప్పుతొల్ల మల్లేశ్ ఏ రాజు, 37, మాజీ హవల్దార్, 20 బెటాలియన్ మద్రాస్ రెజిమెంట్. A2 -- కొండూరి శేషులు, 36, సెపాయ్. A3 -- వినోద్ కుమార్, 34, నాయక్. A4 -- కుచరకంటి ప్రవీణ్, 37, హవల్దార్. A5 -- అవి డే ఏ ఒబి, 32, బారక్‌పూర్, పశ్చిమ బెంగాల్. A6 -- బిర్బల్ షా, 27, చెరకు రసం కేంద్రం నిర్వాహకుడు, బారక్‌పూర్. A7 -- ఉప్పుతొల్ల మల్లికార్జున్, 39, మేస్త్రీ. A8 -- చెమ్మకర్ నిరంజన్, 39, కిరాణా వ్యాపారి. A1పై గతంలో అచంపేట, అమ్రాబాద్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇళ్లలో చోరీలకు సంబంధించిన కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. A5 అవి డే ఏ ఒబిపై కూడా గతంలో ఆయుధాల చట్టం కింద కేసు నమోదైనట్లు వెల్లడించారు. పోలీసుల దర్యాప్తు ప్రకారం, ఈ కేసులో నిందితుల ఉద్దేశం భారీ ఆస్తి నేరాలకు పాల్పడటమేనని, ఎటువంటి ఉగ్రవాద లేదా తీవ్రవాద సంబంధాలు గుర్తించలేదని మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి తెలిపారు. A1ను సెప్టెంబర్ 11న అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపగా, ూ2 నుంచి ూ8 వరకు నిందితులను అరెస్ట్ చేసి అక్టోబర్ 3న కోర్టులో హాజరుపరుస్తున్నట్లు

త్రినేత్ర న్యూస్ తెలంగాణ
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
ఆదివారం అక్టోబర్ 04, 2026
www.trinetnews.com

## రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలపై విస్తృత ఓటరు అవగాహన సదస్సులు నిర్వహించాలి:

**•టీజెఎస్ పార్టీ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అధికార ప్రతినిధి డి.ఎస్. ప్రవీణ్ కుమార్ డిమాండ్**



మల్కాజ్‌గిరి: రాబోయే పట్టభద్రుల మరియు ఉపాధ్యాయ శాసనమండలి ( ఎమ్మెల్సీ ) ఎన్నికల నేపథ్యంలో ఓటర్లలో విస్తృత అవగాహన కల్పించాలని తెలంగాణ జనసమితి ( టీజేఎస్) పార్టీ మల్కాజ్‌గిరి అధికార ప్రతినిధి డి.ఎస్. ప్రవీణ్ కుమార్ అన్నారు. మల్కాజ్‌గిరిలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాధాన్యతా ఓటింగ్ విధానం (ప్రిఫెరెంటిల్ వోటింగ్ సిస్టం ) ఉంటుందని, దీనిపై సరైన అవగాహన లేకపోవడం వల్ల చాలా ఓట్లు చెల్లకుండా పోతున్నాయని ప్రవీణ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి విద్యావంతుడు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవడంతో పాటు, దానిని సరైన పద్ధతిలో వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యం బలోపేతమవుతుందని ఆయన పేర్కొన్నారు.ప్రకటనలోని ముఖ్యమైన అంశాలుఓటింగ్ విధానంపై అవగాహన సాధారణ ఎన్నికల తరహాలో ఈవీఎం బటన్ నొక్కడం కాకుండా, ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులకు ప్రాధాన్యత క్రమంలో (1, 2, 3...) అంకెలను కేటాయించాల్సి ఉంటుంది.ఈ విధానంపై డిజిటల్ మరియు క్షేత్రస్థాయి ప్రచారం నిర్వహించకపోతే ఓట్లు వృథా అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.నమోదుపై నిర్లక్ష్యం వద్దు: జిల్లా పరిధిలోని పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓటరు నమోదుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు, ఉద్యోగ సంఘాలు ఓటర్లను చైతన్యపరచడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.టీజెఎస్ కార్యాచరణ: మల్కాజ్‌గిరి నియోజకవర్గ వ్యాప్తంగా ఓటర్లకు నమోదు ప్రక్రియ మరియు ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించేందుకు టీజెఎస్ పార్టీ ముందు ఉంటుంది అని ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు.అర్హులైన పట్టభద్రులు, ఉపాధ్యాయులు వెంటనే ఓటరు జాబితాలో తమ పేర్లను సరిచూసుకొని, సకాలంలో నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.డి.ఎస్. ప్రవీణ్ కుమార్ కార్యాలయంఅధికార ప్రతినిధి, టీజెఎస్ ( టీజేఎస్ ) పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా.

## ప్రమాదం జరగకముందే నాలాకు మరమ్మతులు చేపట్టాలి బిఆర్ఎస్ నాయకులు మంద జగన్



బోధ నగర్ డివిజన్ ఈశ్వరి బాయి నగర్ మార్కండేయ టెంపుల్ ఎదురుగా నాలాపై ఉన్న స్లాబ్‌లో ఒక భాగం విరిగిపోవడంతో ప్రమాదకర పరిస్థితి ఏర్పడింది. నాలా స్లాబ్ మరింత దెబ్బతిని కూలిపోయే అవకాశం ఉండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఈ విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ నాయకులు మాజీ వార్డు మెంబర్ మంద జగన్ అక్కడికి చేరుకొని వెంటనే పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని అధికారులకు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంద జగన్ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న నా దృష్టికి తీసుకొనిరవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతకింది మల్లేష్, తులసి, కవిత, పావని, నిమిత, ప్రశాంత్, వనజ, సునిత, ధనమ్మ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ మ్మెల్సీ లో కాంగ్రెస్ కు నిరుద్యోగులం బుద్ధి చెబుతాంబికయ్య వెంకటేష్



రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ఉద్యోగాల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న యువతకు స్పష్టమైన ఉద్యోగ క్యాలెండర్, ఖాళీల భర్తీపై నిర్దిష్ట కార్యాచరణ ప్రకటించాలని నిరుద్యోగ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు.
మూడేళ్లుగా నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించకుండా ఇప్పుడు మ్మెల్సీ ఎన్నికల్లో నిరుద్యోగుల ఓట్లు అడగడానికి కాంగ్రెస్ అభ్యర్థులు వస్తున్నారు. ఉద్యోగాల కోసం పోరాడుతున్న నిరుద్యోగులు తమ సమస్యలను పట్టించుకోని అభ్యర్థులను ప్రశ్నించాలి”అన్నారు.గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–3, గ్రూప్–4, ఖూజ, ఊూ తదితర ఉద్యోగ ఖాళీలపై నిరుద్యోగులకు స్పష్టమైన నోటిఫికేషన్ తేదీలు, భర్తీ షెడ్యూల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం గతంలో జాబ్ క్యాలెండర్, ఖాళీలను భర్తీ చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో, ఆ హామీల అమలుపై నిరుద్యోగులకు ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని కోరారు.ఉద్యోగాల కోసం పోరాడుతున్న నిరుద్యోగుల గొంతుకను పట్టించుకోకుండా కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ఓట్లు అడిగితే ప్రజలు ప్రశ్నిస్తారు. నిరుద్యోగుల సమస్యలపై మా డిమాండ్లను పట్టించుకోని కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించడమే మా నిరుద్యోగుల లక్ష్యం” అని కయ్య వెంకటేష్ తెలిపారు.ప్రతి శాఖలో ఉన్న ఖాళీలను ప్రజలకు వెల్లడించి, నోటిఫికేషన్ తేదీలు, పరీక్ష తేదీలు, నియామక తేదీలతో కూడిన స్పష్టమైన షెడ్యూల్ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.నిరుద్యోగుల భవిష్యత్తుపై స్పష్టమైన హామీ ఇచ్చే వరకు మా పోరాటం కొనసాగుతుంది. ఉద్యోగాలు, నిరుద్యోగ సమస్యే మా ప్రధాన ఎజెండా” అని తెలిపారు ఈ కార్యక్రమంలో జీూజ నాయకులు కయ్య వెంకటేష్, ఆర్కె వన్నర్ చోళ, కిరణ్ రాథోడ్,సూర్య, కుమార్,రమేష్,మహేష్,ప్రకాష్, పాల్గొన్నారు..

## సేవా సంపర్క్ అభియాన్ ద్వారా విద్యార్థుల్లో ప్రతిభకు ప్రోత్సాహం

**అనూష బాబ్జి సేవా సంపర్క్ అభినయ్ జిల్లా కోకన్వీనర్**



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాలను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సేవా సంపర్క్ అభియాన్‌లో భాగంగా పరిగి పట్టణంలో విద్యార్థుల ప్రతిభను వెలికితీసే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని ఇండస్ట్ వ్యాలీ స్కూల్లో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన వంటి సృజనాత్మక పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.విద్యార్థుల్లో కేవలం విద్యాపరమైన ప్రతిభ మాత్రమే కాకుండా సృజనాత్మక ఆలోచన, దేశభక్తి, సామాజిక బాధ్యత, సేవాభావం వంటి విలువలను పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది అని వారు అన్నారు.
పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రశంసా పత్రాలతో సత్కరించి ప్రోత్సహించడం జరిగింది.చిన్న వయసులోనే విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా వారి ఆత్మవిశ్వాసం మరింత పెరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.సేవా సంపర్క్ అభియాన్ అంటే కేవలం ఒక కార్యక్రమం కాదు సమాజంలోని వివిధ వర్గాలతో అనుసంధానం పెంచుతూ, యువతలో సేవా భావన సామాజిక బాధ్యతను పెంపొందించే ఒక ప్రయత్నం.ఈకార్యక్రమంలో ముకుంద నాగేశ్వర్ ముఖ్య అతిథి, వీరేష్ స్కూల్ కరస్పాండెంట్,లక్ష్మి పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ పాఠశాల యాజమాన్యానికి, ఉపాధ్యాయులకు,విద్యార్థులకు సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు.

## పేరులో మార్పు కోసం తహసీల్దార్‌కు దరఖాస్తు


APPLICATION FOR THE CHANGE OF NAME
ANNEXURE – III
To
THE TAHSILDAR,
EXECUTIVE MAGISTRATE,
MEDIPALLY MANDAL,
MEDCHAL-MALKAJGIRI DIST, TELANGANA.
Respected Sir,
1. The following particulars in respect of My Son was Furnished as P THANMAY SAI SURYA GOUD S/o. SHIVA KUMAR P (Old Name) age 13 years, Qualification: 9TH CLASS, Occupation: Student, [illegible]
2. Age on the date of application is : 13 years (Date of Birth 23-08-2012)
3. I intend to correct my Son's existing Name as PUTTAPAKA THANMAY SAI SURYA GOUD S/o. PUTTAPAKA SHIVA KUMAR (New Name) [due to wrong entry in the aadhaar records]
4. I, SHIVA KUMAR P S/o. P VENKATAIAH, [illegible]
Signature of the Applicant
SHIVA KUMAR P
Enclosures: [illegible]

మెద్చల్--మల్కాజిగిరి జిల్లామెదిపల్లి మండల తహసీల్దార్, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌కు పుట్టపాక శివకుమార్ తన కుమారుడి పేరు సవరణ కోసం దరఖాస్తు సమర్పించారు.దరఖాస్తులో పేర్కొన్న వివరాల ప్రకారం, ప్రస్తుతం ఆధార్ రికార్డుల్లో పి.తన్మాయ్ సాయి సూర్య గౌడ్ గా ఉన్న పేరును పుట్టపాక తన్మాయ్ సాయి సూర్య గౌడ్ గా సవరించాలని కోరారు. ఆధార్ రికార్డుల్లో పేరు తప్పుగా నమోదు కావడంతో ఈ సవరణ కోరుతున్నట్లు తెలిపారు.కుమారుడి జన్మతేదీ 23-08-2012 కాగా, ప్రస్తుతం వయస్సు 13 సంవత్సరాలు, 9వ తరగతి చదువుతున్నట్లు దరఖాస్తులో పేర్కొన్నారు. పేరు సవరణకు సంబంధించి ఆధార్ కార్డులు, జనన ధ్రువీకరణ పత్రం/విద్యా ఆధారాలు తదితర పత్రాలను దరఖాస్తుతో జత చేసినట్లు తెలిపారు.
పేరు సవరణకు సంబంధించి తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు స్వీకరించినట్లు పత్రంపై ఉన్న కార్యాలయ ముద్ర ద్వారా తెలుస్తోంది.

## అనంతగిరి ఘాట్ రోడ్డులో జరిగిన ప్రమాదంపై దిగ్భ్రాంతి

**బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్**



ఓడిఎఫ్ క్యాసారం నుండి ధారూర్ మండలం చింతకుంట వెళ్తున్న ప్రైవేట్ బస్సు బోల్తా ఇస్నాపూర్ లో వెల్డింగ్ పని చేస్తున్న వ్యక్తి శుక్రవారం మరణించడంతో చింతకుంటలో అతని అంతక్రియలకు హాజరయ్యేందుకు బస్సులో వెళ్తున్న అతని బంధువులు అనంతగిరి ఘాట్ దిగాక మూలమలుపు వద్ద బస్సు పల్టీ కొట్టడంతో అక్కడికక్కడే పలువురు మృతి చెందారు.ఈ సంఘటనపై దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. బస్సులో ఉన్న ప్రయాణికులందరూ నిరుపేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వాళ్లేనని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం వెంటనే మరణించిన వారికి ఎక్స్ క్రేజీయా ప్రకటించాలని, వారి కుటుంబాలను ఆదుకోవాలని అలాగే క్షతగాత్రులను సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటల్లో మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వారి హాస్పిటల్ ఖర్చులను మొత్తం ప్రభుత్వమే భరించాలని అన్నారు.

## రెండో ఫేస్ సార్ న్యూ ఓటర్లు ఫామ్ 6 డిస్ట్రిబ్యూషన్



**ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి**

సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ శ్రీ ర్యాల రాజేందర్ యాదవ్ ఈరోజు రెండో ఫేస్ కార్యక్రమం లో భాగంగా
మెట్టుగూడ కాంగ్రెస్ పార్టీ హెల్ప్ డిస్క్ ఎరుపాటు చేసి ఓటర్లు కి ఫార్మ్ 6 పంపిన చేసారు.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ డివిజన్ నాయకులు మహిళా నాయకురాలు రూప రూత్ క్లారి, కస్తూరి, సంతోషి , సుజాత నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్లకు నిధులు మంజూరు చేయాలి

**కిష్టారెడ్డిపేట్, పటేల్‌గూడలో రహదారుల దుస్థితిపై పట్టణ కాంగ్రెస్ వినతి**



పటాన్చెరు, నియోజవర్గం
అమీన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేట్, పటేల్‌గూడ తదితర ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని అమీన్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి కోరారు. ఈ మేరకు జోనల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్న ప్రాంతాలను గుర్తించి అవసరమైన చోట్ల సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టాలని ఆయన కోరారు. రోడ్ల నిర్మాణంతో స్థానికులకు మెరుగైన రవాణా సౌకర్యం అందడంతో పాటు రాకపోకలు సురక్షితంగా సాగుతాయని పేర్కొన్నారు.ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిపాదిత రోడ్లకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేసి, నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని శశిధర్ రెడ్డి జోనల్ కమిషనర్‌ను కోరారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు శీను, శ్రీనివాస్ గౌడ్, వార్డు సభ్యుడు మల్లేష్, సాయిలు, రమేష్, సురేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా మాడిపెల్లి శంకర్, జక్కని అనంతము, పిప్పలపల్లి అగేశ్వర్ రావు, సదానందా స్వామి జన్మదిన శుభాకాంక్షలు

మాడిపెల్లి శంకర్, జక్కని అనంతము, పిప్పలపల్లి ఆగేశ్వర్ రావు, సదానంద స్వామి



జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.
ఈ వేడుకల్లో స్నేహితులు, శ్రేయోభిలాషులు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆత్మీయంగా ముచ్చటించారు.
జన్మదినోత్సవం జరుపుకుంటున్న మాడిపెల్లి శంకర్, జక్కని అనంతము, పిప్పలపల్లి ఆగేశ్వర్ రావు, సదానంద స్వామి గార్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో పోకల నాగేందర్, మంద మురళి, లింగమయ్య యాదవ్, సంజీవరావు, బండారి పవన్, బాలకృష్ణ గౌడ్, గోప ఆనంద్, రాజశేఖర్ గుప్తా, అంజయ్య, సుధాకర్ రావు, సాదినేని నవీన్ కుమార్, కాసుల సురేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ ధాన్యం తిరిగిస్తారా? ఆస్తులు కోల్పోతారా?: మిల్లర్లకు**

# గురుదక్షిణ సంపాదకులకు తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సంచాలకుల అభినందనలు

ప్రతినిధికూకట్పల్లి అక్టోబర్ 03

సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం జర్నలిజం విద్యార్థులు సంపాదకులుగా వ్యవహరించి తీర్చిదిద్దిన గురుదక్షిణ కవితా సంకలనానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు ఐఏఎస్ ఏనుగు నరసింహారెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అంజిబాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రచురితమైన ఈ కవితా సంకలనం గురువుల గొప్పదనాన్ని చాటేలా ఉందని ఆయన కొనియాడారు. విద్యార్థి దశలోనే సంపాదకులుగా వ్యవహరించడం గొప్ప విషయం అన్నారు. కవితలే కాకుండా సమాజాన్ని మేలుకొల్పేలా ఉండే మరిన్ని రచనలు కూడా చేయాలని సంపాదకులు కొండూరి కోటి బాబు, ఎస్ కళ్యాణ్ దాస్, నాగుల ఆంజనేయులు (అంజిబాబు)కు సూచించారు.

తెలుగు రాష్ట్రాలకు చెందిన దాదాపు 60 మంది కవులు గురువు ఔన్నత్యాన్ని తెలియజేస్తూ కవితలను రాయడం మంచి పరిణామం అన్నారు. జర్నలిజం విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని మిగతా విద్యార్థులు కూడా ఇతర రంగాల్లో తమ ప్రతిభను చాటాలని సూచించారు. కళలు ప్రతిభలు ప్రతి వ్యక్తులోనూ దాగి ఉంటాయని, వాటిని వ్యక్తిగత ప్రయోజనాలతో పాటు సమాజానికి తోడ్పడేలా రచనలు చేయవలసిన అవసరం ఉందని. ఆదర్శవంతమైన రచనలు లక్ష మెదళ్లను కదిలించేలా పనిచేస్తాయని పేర్కొన్నారు.



ఇలాంటి ఉత్సాహవంతులైన, ప్రతిభావంతులైన విద్యార్థుల నుంచి మరికొన్ని ఉత్తమ రచనలు ఆశిస్తున్నానని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. హైదరాబాద్ రవీంద్రభారతి ప్రాంగణంలో తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుల వారి కార్యాలయంలో గురుదక్షిణ కవితా సంకలన సంపాదకులు కొండూరి కోటి బాబు, ఎస్ కళ్యాణ్ దాస్. అంజిబాబు ఫౌండేషన్ ప్రతినిధి నాగుల ఆంజనేయులు (అంజిబాబు )మర్యాదపూర్వకంగా కలిసి గురుదక్షిణ పుస్తకాన్ని అందజేసి ముందుమాట రాసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# అర్హత ఎవరికి.. పెన్షన్ ఎవరికి?

- పాల్వంచలో పెన్షన్ లబ్ధిదారులపై క్షేత్రస్థాయి పరిశీలనకు డిమాండ్





పాల్వంచ పట్టణంలోని 27 డివిజన్లలో దివ్యాంగులు, వృద్ధులకు అందుతున్న సామాజిక భద్రతా పెన్షన్లపై సమగ్ర విచారణ చేపట్టాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. అర్హత లేని వ్యక్తులు పెన్షన్లు పొందుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో లబ్ధిదారుల అర్హతలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరారు. ఈ మేరకు బీజేపీ నాయకులు పొనిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ అంకిత్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పొనిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పాల్వంచలో దివ్యాంగుల పెన్షన్ల మంజూరు, పంపిణీపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయని తెలిపారు. శారీరక వైకల్యం లేని కొందరు తప్పుడు ధ్రువీకరణ పత్రాల ఆధారంగా దివ్యాంగుల పెన్షన్లు పొందుతున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. సదరం క్యాంపుల్లో కొందరు వైద్య అధికారులు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు తీసుకుని వైకల్యం లేని వారికి సైతం ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారనే ఆరోపణలు ఉన్నాయని, వాటి నిజానిజాలను తేల్చాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగులపైనా పరిశీలన: కేటీపీఎస్ తదితర ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసి పదవీ విరమణ చేసిన కొందరు ఇప్పటికే ప్రభుత్వ పెన్షన్లు పొందుతున్నప్పటికీ వృద్ధాప్య పెన్షన్లు కూడా పొందుతున్నారనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. నెలకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ప్రభుత్వ పెన్షన్ పొందుతున్న వారు వృద్ధాప్య పెన్షన్‌కు అర్హులా? కాదా? అనే అంశాన్ని నిబంధనల ప్రకారం పరిశీలించాలని కోరారు. 27 డివిజన్లలో క్షేత్రస్థాయి తనిఖీలు: దివ్యాంగుల పెన్షన్ కింద నెలకు రూ.3,016, వృద్ధాప్య చేయూత పెన్షన్ కింద రూ.2,016 చొప్పున ప్రభుత్వం అందిస్తున్న నేపథ్యంలో అనర్హులు లబ్ధి పొందుతున్నట్లు నిర్ధారణ అయితే ప్రజాధనం దుర్వినియోగమైనట్లేనని పేర్కొన్నారు. పాల్వంచలోని మొత్తం 27 డివిజన్లలో లబ్ధిదారుల అర్హతలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరారు. అనుమానాస్పద దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాలను ప్రత్యేక వైద్య బృందాలతో పునఃపరిశీలించాలని, అర్హత లేని వారు పెన్షన్లు పొందుతున్నట్లు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమాలకు పాల్పడినట్లు ఆధారాలతో తేలిన అధికారులు, సిబ్బందిపై చట్టపరమైన, శాఖాపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. అనర్హులకు చెల్లించిన నిధులపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుని, నిజమైన అర్హులకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాలోత్ ప్రశాంత్ నాయక్, కొత్తపల్లి విజయ, శాంపురి నాగేంద్రబాబు, వాంకుడోత్ హాథిరామ్, సంకినేని రుద్ర, అజ్మీరా హాథిరామ్, కోరదల రమేష్, శాంపురి పవన్, పండు తదితరులు పాల్గొన్నారు.

# ఒకరోజు ఒక వార్డు కార్యక్రమంలో పాల్గొన్న బేరి రామ్ చందర్ యాదవ్





ఒకరోజు ఒక వార్డ్ కార్యక్రమంలో భాగంగా నల్లగండ్ల 256 వార్డులోని గుల్మోహర్ కాలనీలో సమీక్షా సమావేశంలో నేతాజీ నగర్ కాలనీ లోని సమస్యలపై జిహెచ్ఎంసి కమిషనర్ కి వినతి పత్రం అందజేసిన నేతాజీ నగర్ కాలనీ అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్. ఈ సమీక్షా సమావేశంలో క్షేత్ర స్థాయిలో పనుల పురోగతి గురించి జరుగుతున్న పనులను సమీక్షించడానికి స్థానిక సమస్యలను పరిష్కరించడానికి జోనల్ కమిషనర్,డిప్యూటీ కమిషనర్ ,ఇంజనీరింగ్, ఎస్డబ్ల్యూఎం, టౌన్ ప్లానింగ్, యూబీడీ,ఎంటమాలజీ ఇతర శాఖలకు చెందిన సంబంధిత లైన్ డిపార్ట్మెంట్ అధికారులు స్థానిక ఆర్‌డబ్ల్యూఏల ప్రతినిధులతో కలిసి సమావేశం నిర్వహించబడింది. కాలనీ పార్క్ లో నీటి సంరక్షణ కొరకు ఏర్పాటు చేసిన పిట్ ను పరిశీలించడం జరిగినది. నేతాజీ నగర్ కాలనీ లో నెలకొన్న సమస్యలను ముఖ్యంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు సిసి రోడ్లు వీధిలైట్లు శానిటేషన్ వర్క్ కాలనీలో నెలకొన్న మౌలిక వసతులపై వినతి పత్రం అందించిన కాలనీ అధ్యక్షులు భేరి రామచంద్ర యాదవ్ కమీషనర్, డిప్యూటీ కమిషనర్ జిహెచ్ఎంసి సిబ్బంది కి కాలనీలో నెలకొన్న సమస్యలు వివరించడం జరిగింది . వారు సానుకూలంగా స్పందిస్తూ తొందర్లో ఈ సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పడం చాలా సంతోషదాయకం అని భేరి రామచందర్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. ఒకరోజు ఒక వార్డు లాంటి కార్యక్రమాలు చేపడుతూ ప్రతి కాలనీకి అధికారులు వచ్చి కాలనీలో ఉన్న సమస్యలు తెలుసుకుని ఆ సమస్యలను పరిష్కరించుతున్నారంటే అధికారులకు ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపిన కాలనీ అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్,కే నరసింహా యాదవ్, అన్నదొర,దశరథ్ నాయక్, గణేష్ నాయక్, జోషి రాఘవేంద్ర శర్మ, మణికంఠ, ప్రసాద్,కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# సాహిత్య, సామాజిక సేవకు అరుదైన గౌరవం

- రాణి నల్లమోతుకు గౌరవ డాక్టరేట్
- సేవా మార్గంలో విశిష్ట గుర్తింపు
- సీతాస్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ రాణి నల్లమోతుకు డాక్టరేట్
- సామాజిక సేవకు దక్కిన ప్రతిష్ఠాత్మక గౌరవం.





సాహిత్య, సామాజిక సేవా రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్న సీతాస్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ రాణి నల్లమోతుకు అరుదైన గౌరవం దక్కింది. సేవా రంగంలో ఆమె చేస్తున్న విశిష్ట కృషికి గుర్తింపుగా వెబ్బిక్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 2న ఆమెకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు.

విశిష్ట సేవలకు గుర్తింపు

సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు సేవలందిస్తున్న సీతాస్ చారిటబుల్ ట్రస్ట్.

సాహిత్య, సామాజిక సేవా రంగాల్లో రాణి నల్లమోతు విశేష కృషి.

సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలోని వివిధ వర్గాలకు అండగా నిలుస్తున్న సీతాస్.

ప్రజా సంక్షేమం, సామాజిక అభివృద్ధి కోసం నిరంతరం కార్యక్రమాల నిర్వహణ.

ఆమె సేవలను గుర్తించిన వెబ్బిక్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌తో సత్కారం.

ఈ గౌరవం సీతాస్ చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలకు మరింత ప్రోత్సాహాన్ని అందించనుంది. ఈ సందర్భంగా రాణి నల్లమోతు మాట్లాడుతూ, తన సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ అందించిన వెబ్బిక్ యూనివర్సిటీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ గౌరవం తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో కూడా సాహిత్య, సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తానని పేర్కొన్నారు.

# రోడ్డుకు... ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించిన టిడిపి నాయకుడు పూడి చంద్రు నాయుడు



మండలంలో పెదమేడపల్లి మోడల్ స్కూల్ బస్ స్టాప్ నుండి పెద్దచామలపల్లి వెళ్లే రహదారిలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి మూలమలుపు వద్ద ప్రమాదకరంగా మారాయని పలువురు స్థానికులు ఆవేదం వ్యక్తం చేస్తున్నారు ఈ రహదారిలో ఏపీ మోడల్ స్కూల్ ఉండడంతో విద్యార్థులు స్కూలుకు వెళు తున్నప్పుడు ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడం వలన పలు ప్రమాదాలు జరుగుతున్నాయని విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఈ విషయం తెలుసుకున్న మోడల్ స్కూల్ చైర్మన్ పూడి తులసి భర్త చందు నాయుడు వెంటనే స్పందించి మోడల్ స్కూల్ బస్ స్టాప్ నుంచి మోడల్ స్కూల్ దాటినంతవరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను బ్లేడ్ ట్రాక్టర్ సహాయంతో తొలగించి, రోడ్డును చదును చేయించారు. స్థానిక ప్రజలు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షము వ్యక్తం చేస్తున్నారు

# నేడు సేవారత్న డాక్టర్" వేన్న ఈశ్వరప్ప జన్మదిన వేడుకలు



సమాజ సేవలో నిరంతరం కృషి చేస్తూ ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచి సేవ రత్న అవార్డు గ్రహీత, పరిగి నియోజకవర్గ ముద్దుబిడ్డ జన్మదిన వేడుకలు ఘనంగా జరిపిద్దామని వెన్న చెడు గ్రామం గండేడ్ మండలం పరిగి నియోజకవర్గం పల్లవి ఆడిటోరియం నంచర్ల గేట్ మహ్మదాబాద్ మండలం లో జరిపించడం జరుగుతుందని ఆహ్వాన కమిటీ అభిమానులు తెలిపారు. కావున నియోజకవర్గ ప్రజలు,నాయకులు, మిత్రులు,బంధువులు, శ్రేయోభిలాషులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పుట్టినరోజు కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా ఆహ్వాన కమిటీ అభిమానులు కోరారు.

# నూతన డ్వాక్రా భవన నిర్మాణానికి భూమి పూజ



పూడూరు మండలం అంగడి చిట్టెంపల్లి గ్రామంలో సర్పంచ్ ఎస్.యాదవ రెడ్డి ఆధ్వర్యంలో నూతన డ్వాక్రా బిల్డింగ్ కు గ్రామస్తులతో కలిసి భూమి పూజ చేశారు. మహిళలు రుణాలు సద్వినియోగం చేసుకొని వ్యాపారాలు చేసి అభివృద్ధి సాధించారని సర్పంచ్ తెలిపారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ మమత,గ్రామ డ్వాక్రా సంఘం మహిళలు,కార్యదర్శి నాగయ్య, వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# సేవా సంకల్ప అభినయ్ కార్యక్రమం విజయవంతం చేద్దాం

## బిజెపి పరిగి మండల అధ్యక్షురాలు అనసూయ శ్యాంసుందర్



పరిగి మండలం రూప్ ఖాన్ పెట్, బాబా పూర్ లో సేవా సంపర్క అభియాన్ కార్యక్రమంలో భాగంగా భారతీయ జనతా పార్టీ పరిగి మండలం అధ్యక్షురాలు అనసూయ శ్యాంసుందర్ ఆధ్వర్యంలో రూఫ్ ఖాన్‌పేట్, బాబాపూర్ గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో అంగన్వాడీ టీచర్లకు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈసందర్భంగా అనసూయ శ్యాంసుందర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ద్వారా అంగన్వాడీ కేంద్రాలకు అందుతున్న పౌష్టికాహారం అర్హులైన గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు చేరేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. బాలామృతం, గుడ్లు, పాలు, మురుకులు తదితర పౌష్టికాహార పదార్థాలను కేంద్రాల ద్వారా అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని ఆమె అన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పొందుతున్న లబ్ధిదారులు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పరిగి అసెంబ్లీ కన్వీనర్ నరసింహ, బీజేపీ నాయకులు సుధాకర్, శేఖర్, నవీన్,

# సల్మాన్ 'మాతృభూమి' సెన్సార్‌కు లైన్ క్లియర్..!



బాలీవుడ్ అగ్రకథానాయకుడు సల్మాన్ ఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తోన్న చిత్రం 'మాతృభూమి'. ప్రకటించిన నాటి నుంచే వార్తల్లో నిలిచిన ఈ సినిమా సెన్సార్‌కు ఇప్పుడు లైన్ క్లియర్ అయినట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి తాజాగా కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నుంచి 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్' వచ్చినట్లు సమాచారం. అయితే, సినిమా విడుదలకు సెన్సార్ బోర్డు నుంచి అనుమతి పొందాల్సి ఉంది. భారత రక్షణ మంత్రిత్వశాఖ సూచనల మేరకు దర్శకుడు అపూర్వ లఖియా ఈ ప్రాజెక్టులో భారీస్థాయిలో మార్పులు చేసినట్లు గతంలో వార్తలు వచ్చాయి. అందులో భాగంగానే దాదాపు 40శాతం సినిమాను రీషూట్ చేశారట. సినిమా కథలో కొన్ని కల్పిత అంశాలను, బ్యాగ్రౌండ్ స్టోరీని అదనంగా జోడించి కొత్త వెర్షన్‌ను సిద్ధం చేశారు. ఈ మార్పులను పరిగణనలోకి తీసుకున్న కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సినిమాకు ఎన్ఓసీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పుడిక సెన్సార్ బోర్డ్ నుంచి సర్టిఫికెట్ పొంది.. త్వరలోనే దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.భారత్-చైనా మధ్య 2020లో జరిగిన గల్వాన్ ఘర్షణల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించిన సంగతి తెలిసిందే. తొలుత దీనికి 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' అని టైటిల్ ఖరారు చేశారు. ఆ తర్వాత దాన్ని 'మాతృభూమి'గా మారుస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. నవంబర్ 13న ఈ సినిమాను విడుదల చేయాలని చిత్రబృందం భావిస్తోంది.

# ఆ నీచులను వదిలిపెట్టను: ఎన్టీఆర్ స్ట్రాంగ్ వార్నింగ్



సామాజిక మాధ్యమాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను ఉపయోగించి అసభ్యకర రీతిలో వీడియోలను క్రియేట్ చేయడంపై అగ్రకథానాయకుడు ఎన్టీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవర సినిమాలోని 'చుట్టమల్లే' పాట వీడియోను ఏఐతో మార్ఫింగ్ చేయడంపై ఆయన మండిపడ్డారు. మహిళలను పూజించే దేశంలో వారి గౌరవాన్ని దిగజార్చారంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. వారిని వదిలిపెట్టబోనని, బాధ్యులపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు."ఇది అత్యంత అసహ్యకరమైన చర్య. మహిళలను తల్లులుగా, దేవతలుగా పూజించే నేల మనది. 'మాతృదేవోభవ' అనే నినాదం మన సంస్కృతిలో భాగమైన చోట.. కొందరు వ్యక్తులు అత్యంత దిగజారి ప్రవర్తిస్తున్నారు. ఒక మహిళను అవమానించేలా ఏఐ సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ ఇలాంటి నీచమైన కంటెంట్‌ను సృష్టించడం సిగ్గుచేటు. 'చుట్టమల్లే' పాట మార్ఫింగ్ వీడియో వెనుక ఉన్న నీచులు ఎవరినీ వదిలిపెట్టను" అని ఎన్టీఆర్ హెచ్చరించారు. ఇక ఇలాంటి అసభ్యరమైన కంటెంట్‌ను ఎవరూ చూడొద్దని ఎన్టీఆర్ విజ్ఞప్తి చేశారు. "ఈరోజు వేరొక మహిళకు ఇలాంటి అవమానం జరిగింది. రేపు మీ ఇంట్లో మీ తల్లి, భార్య, కుమార్తెకూ ఇదే పరిస్థితి ఎదురవ్వొచ్చు. ఏఐ దుర్వినియోగాన్ని అరికట్టడానికి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడానికి కేంద్రంతో పాటు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే కఠినమైన నిబంధనలు తీసుకురావాలని కోరుతున్నాను" అని ఎన్టీఆర్ పేర్కొన్నారు.ఏఐ మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలు సెలబ్రిటీల పాలిట నరకంగా మారాయి. ఇటీవల 'అర్జున్ రెడ్డి' హీరోయిన్ శాలిని పాండే కూడా దీని బారిన పడ్డారు. ఆమెపై అసభ్యకర రీతిలో వీడియోలను రూపొందించగా అవి వైరల్ అయ్యాయి. దీనిపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. టెక్నాలజీని ఇలా ఉపయోగించడం సరికాదంటూ మండిపడ్డారు. ఆ వీడియో కనిపిస్తే ఎవరూ షేర్, డౌన్‌లోడ్ చేయొద్దని.. వెంటనే రిపోర్ట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో రష్మిక, కత్రినా కైఫ్, మృణాల్ ఠాకూర్, కీర్తి సురేశ్‌కు సంబంధించిన డీప్‌ఫేక్ వీడియోలు కూడా వైరలైన సంగతి తెలిసిందే.

# 'దృశ్యం: ది కన్‌క్లూజన్'.. బాక్సాఫీస్ వద్ద తొలిరోజే రికార్డు వసూళ్లు




అజయ్ దేవగణ్ ప్రధాన పాత్ర పోషించిన క్రైమ్ థ్రిల్లర్ 'దృశ్యం: ది కన్‌క్లూజన్'. 'దృశ్యం' సిరీస్‌లో ఇది చివరి భాగం. అక్టోబరు 2న విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద రికార్డు సృష్టించింది. తొలిరోజే రికార్డు వసూళ్లు రాబట్టి అజయ్ కెరీర్‌లోనే అతిపెద్ద ఓపెనర్‌గా నిలిచింది.ట్రేడ్ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ చిత్రం తొలిరోజే ప్రపంచవ్యాప్తంగా రూ.95.10 కోట్ల (గ్రాస్) వసూళ్లను సాధించింది. భారతదేశంలో రూ.66.75 కోట్ల నెట్ (గ్రాస్ రూ.80.10 కోట్లు) రాబట్టింది. విదేశాల నుంచి మరో రూ.15 కోట్ల గ్రాస్ కలెక్షన్లు వచ్చాయి. అజయ్ దేవగణ్ సినీ కెరీర్‌లోనే ఇది ఆల్ టైమ్ రికార్డ్ ఓపెనింగ్‌గా నిలిచింది. గతంలో ఆయన నటించిన 'సింగం ఎగైన్' మొదటి రోజు సుమారు రూ.43.5 కోట్ల నెట్ వసూళ్లు సాధించింది. ఇప్పుడు ఆ రికార్డును 'దృశ్యం 3' సునాయాసంగా బద్దలు కొట్టింది. ఆయన కెరీర్‌లో అత్యధిక ఓపెనింగ్స్ సాధించిన చిత్రాల్లో 'సింగం రిటర్న్స్' (రూ.32.1 కోట్లు), 'గోల్‌మాల్ ఎగైన్' (రూ.30.15 కోట్లు), 'రైడ్ 2' (రూ.19.25 కోట్లు) వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.ఎవరైనా 'రాకా'లో అవకాశం ఇప్పించండి: నటి 2015లో వచ్చిన తొలి భాగం 'దృశ్యం' మొదటి రోజు కేవలం రూ.5.85 కోట్లు మాత్రమే వసూలు చేసింది. ఆ సినిమా ఫుల్ రన్‌లో ప్రపంచవ్యాప్తంగా రూ.110 కోట్లు సాధించింది. 2022లో వచ్చిన 'దృశ్యం 2' తొలి రోజు రూ.15.38 కోట్లు రాబట్టి, ముగింపు సమయానికి రూ.342 కోట్ల గ్రాస్ రాబట్టింది. బాలీవుడ్ చరిత్రలోనే తొలి రోజు అత్యధిక వసూళ్లు రాబట్టిన చిత్రాల జాబితాలో 'దృశ్యం 3' మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. మొదటి స్థానంలో 'ధురంధర్: ది రివెంజ్' (రూ.75 కోట్ల నెట్), రెండో స్థానంలో 'జవాన్' (రూ.65.50 కోట్ల నెట్) నిలిచాయి. ఈ ఏడాది 'ధురంధర్: ది రివెంజ్', 'హనుమాన్ అంశ్' చిత్రాల తర్వాత మొదటి రోజే బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన మూడో సినిమాగా 'దృశ్యం 3' ఘనత సాధించింది.

# ఈ ప్రయాణాన్ని మరెవరితోనూ ఊహించుకోలేను!

సినిమాతో పాటు అందులో కలిసి పనిచేసే వ్యక్తులు కూడా ముఖ్యమేనని అంటున్నారు కథానాయిక మాళవిక మోహనన్. దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లోనూ కొత్తదనం నిండిన కథల్ని ఎంచుకుంటూ ప్రేక్షకుల్ని అలరించే ప్రయత్నం చేస్తున్నారీమె. ఈ మధ్యే 'సర్దార్ 2'తో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఆమె ఇప్పుడు విజయ్ సేతుపతితో కలిసి 'పాకెట్ నోవెల్'తో తెరపై మెరవడానికి సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఈ చిత్ర ప్రయాణం గురించి ఇన్‌స్టా వేదికగా పంచుకుంటూ ఓ పోస్ట్ పెట్టారు మాళవిక."కొన్ని సినిమాలు తీస్తున్నప్పుడు అవే ఒక చిన్న ప్రపంచంగా మారిపోతాయి. అలాంటిదే ఈ 'పాకెట్ నోవెల్'. ఇందులో భాగమైనందుకు అదృష్టంగా భావిస్తున్నా. ఈ ప్రయాణంలో నేను నేర్చుకున్న ముఖ్య విషయం.. కేవలం సినిమాలో నటించడం మాత్రమే కాదు.. ఎవరితో కలిసి ఆ చిత్రం చేస్తున్నామన్న దానికి చాలా ప్రాధాన్యత ఉంటుంది. ఒక బృందంతో కలిసి నెలల తరబడి గడుపుతాం. రోజూ ఎన్నో గంటలు కలిసి పనిచేస్తూ.. ఒకరినొకరు అర్థం చేసుకుంటూ.. మంచి చెడు సమయాలను పంచుకుంటుంటాం. మీకు తెలియకుండానే వారు మరో కుటుంబంలా మారిపోతారు. ఇందులో అద్భుతమైన నటుడు విజయ్ సేతుపతితో కలిసి నటించడం ఓ గొప్ప అనుభవం. మీతో తప్పా ఈ ప్రయాణాన్ని మరెవరితోనూ ఊహించుకోలేన"ని ఆ పోస్ట్‌లో రాసుకొచ్చారు.



# కెప్టెన్ స్మిత్ హనుమాన్ చాలీసా పఠనం... నా మనసు చలించింది: చిరంజీవి



ఇటీవల జరిగిన ఫ్లైదుబాయ్ ఘటనపై అగ్రకథానాయకుడు చిరంజీవి స్పందించారు. తన ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణికుల ప్రాణాలు కాపాడిన భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై ప్రశంసలు కురిపించారు. ఆ విపత్కర పరిస్థితుల్లో ఆయన హనుమాన్ చాలీసా పఠించారని తెలిసి తన మనసు చలించిపోయిందని చిరంజీవి అన్నారు."తన ప్రాణాలు ప్రమాదంలో ఉన్నా.. తోటి వారి ప్రాణాలను కాపాడాలనే సంకల్పంతో అసమాన ధైర్యం ప్రదర్శించిన స్మిత్ మచ్చర్‌కు నా హృదయపూర్వక అభినందనలు. దాడికి గురై, తీవ్రంగా గాయపడిన స్థితిలోనూ సమయస్ఫూర్తితో స్పందించి, ఒక్కడై పోరాడిన ఆయన సాహసం ప్రతి భారతీయుడికీ గర్వకారణం. ఆ క్లిష్ట సమయంలో హనుమాన్ చాలీసా పఠిస్తూ మనోధైర్యాన్ని కూడగట్టుకున్నారని తెలిసి నా మనసు చలించింది. ఆ ఆంజనేయస్వామి అనుగ్రహం స్మిత్‌పై ఎప్పుడూ ఉండాలని, ఆయన త్వరగా పూర్తిగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను" అని చిరంజీవి తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

# ఎవరైనా "రాకా"లో అవకాశం ఇప్పించండి: నటి



ప్రేక్షకులు అత్యంత ఆసక్తిగా ఎదురు చూస్తున్న భారతీయ సినిమాల్లో 'రాకా' ఒకటి. అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా రానున్న ఈ సినిమాలో నటి ఐశ్వర్య లక్ష్మి భాగమైనట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఇందులో ఆమె కీలకమైన నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కన్పించనున్నారని ప్రచారం జరిగింది. తాజాగా దీనిపై ఐశ్వర్య లక్ష్మి స్పందించారు. అవి కేవలం రూమర్స్ మాత్రమేనని, వాటిని చూసి తాను కూడా నవ్వుకున్నట్లు తెలిపారు. తనకు ఎవరైనా 'రాకా'లో అవకాశం ఇప్పించాలని సరదాగా కోరారు. దీంతో ఈ ప్రచారానికి చెక్ పడింది.హనుమాన్ చాలీసా చదివి ధైర్యం తెచ్చుకున్నా.. 'రాకా'లో నలుగురు హీరోయిన్స్ ఉంటారని ఎప్పటి నుంచో వార్తలు వస్తున్నాయి. ఇందులో భాగంగా పలువురు కథానాయికల పేర్లు వినిపించాయి. ప్రస్తుతానికి అల్లు అర్జున్‌కు జోడీగా దీపికా పదుకొణె నటించనున్నారు. ఆమెతో పాటు మలయాళ నటి ఫెమినా జార్జ్ కూడా కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటివరకు వీరిద్దరి పేర్లే అధికారికంగా వెల్లడయ్యాయి. జాన్వీ కపూర్, రష్మిక పేర్లు కూడా ఇటీవల తెరపైకి వచ్చినా.. దీనిపై టీమ్ ఇంకా స్పందించలేదు.

త్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
ఆరోగ్యం+
తెలుగు దిన పత్రిక

ఆదివారం అక్టోబర్ 04, 2026

www.trinetnews.com

# మానుర్‌లో బాలల భద్రత, సైబర్ నేరాలపై అవగాహన

**– షీ టీమ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కార్యక్రమం.. మహిళలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచన**



**నారాయణఖేడ్ అక్టోబర్ 3 సంకల్ప వారధి ప్రతినిధి:**
ఖేడ్ నియోజకవర్గం మానుర్ మండల కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంగారెడ్డి జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో మహిళల భద్రత, బాలల రక్షణ, సైబర్ నేరాలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్యరెడ్డి, నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. నారాయణఖేడ్ డివిజన్ షీ టీమ్ ఇన్‌చార్జి ఏఎస్సై తులసీరాం విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

మహిళల రక్షణ కోసం షీ టీమ్ నిరంతరం పనిచేస్తోందని తెలిపారు. మహిళల హక్కులు, బాలల రక్షణ చట్టాలు, పని ప్రదేశాల్లో వేధింపులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

అదేవిధంగా నకిలీ ఖాతాలు, ఆన్‌లైన్ మోసాలు, సామాజిక మాధ్యమాల దుర్వినియోగం, సైబర్ వేధింపుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద సందేశాలు, లింకులు, ఫోన్‌కాల్స్‌కు స్పందించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

అత్యవసర పరిస్థితుల్లో 100, 112, సైబర్ నేరాల కోసం 1930, బాలల సహాయం కోసం 1098, సంగారెడ్డి షీ టీమ్ కోసం 8712656772 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కార్యక్రమంలో షీ టీమ్ కానిస్టేబుల్ చాంగుబాయి, మహిళా పోలీసు సిబ్బంది లత, బాలల సంక్షేమ కమిటీ శాఖకు చెందిన నర్సిములు, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ ప్రసన్న, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఖేడ్ లో ఏరియా ఆసుపత్రి లో వైద్య సేవల పరిశీలన.. డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శ్రీధర్ తనిఖీ

**– వివిధ విభాగాలు, రోగుల వార్డులు, ప్రయోగశాల పరిశీలన.. మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచన**



ఖేడ్ ఏరియా ఆసుపత్రిని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శ్రీధర్ శనివారం సందర్శించి అక్కడ అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలు, రోగుల వార్డులు, ప్రయోగశాల, మందుల విభాగం, రోగులకు అందిస్తున్న ఆహారం, సిబ్బంది హాజరు, సంబంధిత రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఆసుపత్రిలోని సౌకర్యాలు, సిబ్బంది పనితీరుపై వైద్య సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు.

ఆసుపత్రి నిర్వహణ తీరుపై డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శ్రీధర్ సంతృప్తి వ్యక్తం చేశారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మరింత మెరుగుపరచాలని తెలిపారు.

అలాగే ఆసుపత్రిని మరోసారి సందర్శించి వైద్య సేవల పరిస్థితిని పరిశీలిస్తానని డాక్టర్ శ్రీధర్ తెలిపారు.

ఈ పర్యటనలో ఆర్ఎంఓ డాక్టర్ వికాస్, డాక్టర్ శ్రీకాంత్, ఫార్మసిస్ట్, ప్రయోగశాల సాంకేతిక నిపుణుడు, నర్సింగ్ సిబ్బంది, సూపరింటెండెంట్‌తో పాటు వైద్యులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఖేడ్ లో నేడు జర్నలిస్టుల కార్యవర్గ సమావేశం.. బైక్ ర్యాలీ

**– స్వర్ణకార భవన్‌లో సమావేశం.. రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకుల హాజరు**

ఖేడ్ మున్సిపల్ పట్టణంలోని స్వర్ణకార భవన్‌లో ఆదివారం జర్నలిస్టుల కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు సంఘం బాధ్యులు తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ పత్రికా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణతో పాటు రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. జర్నలిస్టుల సమస్యలు, హక్కులు, సంఘం బలోపేతం




తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.

సమావేశానికి ముందు ఉదయం 10.30 గంటలకు బసవేశ్వర చౌక్ నుంచి ద్విచక్ర వాహనాల ర్యాలీ ప్రారంభమై స్వర్ణకార భవన్ వరకు కొనసాగుతుందని తెలిపారు.

కార్యవర్గ సభ్యులు, జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని సంఘం బాధ్యులు కోరారు.

11

# జ్యోతిర్వాస్తు విద్యాపీఠం లో ఘనంగా ఆరుద్రాష్టమి వ్రతం



- వ్రత క్రతువుకు హాజరైన జగ్గారెడ్డి, నిర్మలా జగ్గారెడ్డి
- 2700 మంది మహిళలతో సామూహిక వ్రతం





సంగారెడ్డి జిల్లా ఫసల్‌వాడిలోని శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆధ్వర్యంలో పీఠాధిపతి మహేశ్వర శర్మ సిద్ధాంతి పర్యవేక్షణ లో ఆరుద్రాష్టమి వ్రత క్రతువు కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గారెడ్డి పాల్గొన్నారు.

ఆరుద్రాష్టమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. 2700 మంది మహిళలతో సామూహిక ఆరుద్రాష్టమి వ్రతాన్ని నిర్వహించారు. నిర్మలా జగ్గారెడ్డి సైతం ఈ వ్రతం లో పాల్గొన్నారు.

కార్యక్రమంలో భాగంగా ఆరుద్రాష్టమి మహత్యం, అమ్మవారి విశిష్టత, పూజా విధానాలను నిర్వాహకులు భక్తులకు వివరించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ప్రత్యేక పూజలతో ఫసల్‌వాది జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.

ఈ కార్యక్రమం లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గంగేరి శ్రీహరి, జ్యోతిర్వాస్తు విద్యాపీఠం నిర్వాహకులు పాల్గొన్నారు

# బాణపూర్‌లో దళితులకు ఆలయ ప్రవేశం.. ఈ నెల 5న సామాజిక సమరసత కార్యక్రమం

**– ఆలయ ప్రవేశంతో పాటు సహపంక్తి భోజనం.. కార్యక్రమానికి హాజరుకావాలని ఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి కి ఆహ్వానం**

ఖేడ్ మండలం బాణాపూర్ గ్రామంలో ఈ నెల 5.న సామాజిక సమరసత కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నారాయణఖేడ్ అసెంబ్లీ కన్వీనర్ సాయిరాం తెలిపారు.

కార్యక్రమంలో భాగంగా దళితులకు ఆలయ ప్రవేశం కల్పించడంతో పాటు సహపంక్తి భోజనం నిర్వహించనున్నట్లు చెప్పారు. సామాజిక సమానత్వం,



సోదరభావాన్ని పెంపొందించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కార్యక్రమానికి హాజరు కావాలని నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతిని నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి తప్పకుండా హాజరవుతానని సబ్ కలెక్టర్ తెలిపినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సాయిరాం,రవీందర్ నాయక్, విశ్వనాథ్, గంగారాం తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

# కంబాలపల్లి గ్రామంలో ముమ్మరంగా పారిశుధ్య, విద్యుత్ నిర్వహణ పనులు: సర్పంచ్ ఇందూరి భారతమ్మ బాబు

సదాశివపేట మండలంలోని కంబాలపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ ఇందూరి భారతమ్మ బాబు గారి ఆధ్వర్యంలో ఈరోజు పలు అభివృద్ధి, నిర్వహణ పనులను ముమ్మరంగా చేపట్టారు.

గ్రామంలోని మురికి కాలువల పక్కన, నివాస గృహాల మధ్య విపరీతంగా పెరిగిన పిచ్చి మొక్కలను నివారించేందుకు ట్రాక్టర్ సహాయంతో గడ్డి మందు పిచికారి చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, వర్షాకాలం నేపథ్యంలో దోమలు, ఇతర కీటకాలు వ్యాపించకుండా, ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ఉండేందుకు ముందస్తు పారిశుధ్య చర్యల్లో భాగంగా ఈ పిచికారి కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.



అదేవిధంగా, గ్రామంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా మరియు వోల్టేజ్ సమస్యలు రాకుండా ఉండేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఇందులో భాగంగా స్థానిక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రక్షణ చర్యల కోసం కొత్తగా ఎర్తింగ్ రాడ్స్ పాతించే పనులను దగ్గరుండి పర్యవేక్షించారు.

ఈ పారిశుధ్య, విద్యుత్ నిర్వహణ కార్యక్రమాల్లో ఉప సర్పంచ్ కుమ్మరి పార్వతమ్మ ఆంజనేయులు, వార్డ్ మెంబర్ ఇందూరి సునీత మహేష్ బాబు మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

13

# సంగారెడ్డి జిల్లాలో ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్.. అక్టోబర్ 7 వరకు దరఖాస్తులు

- **సంగారెడ్డి, జహీరాబాద్, అందోల్ కేంద్రాల్లో అక్టోబర్ 10 నుంచి శిక్షణ.. ఉచిత స్టడీ మెటీరియల్‌తో పాటు ఫిజికల్ ట్రైనింగ్**

పోలీసు ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు సంగారెడ్డి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ అందించనున్నారు. జిల్లా కలెక్టర్ ప్రీతిక్ జైన్, ఐఏఎస్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

జిల్లాలోని సంగారెడ్డి, జహీరాబాద్, అందోల్ కేంద్రాల్లో కోచింగ్ తరగతులు నిర్వహించనున్నారు. అక్టోబర్ 10, 2026 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయి.

అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్, అనుభవజ్ఞులైన బోధనా సిబ్బందితో పోటీ పరీక్షలకు సంబంధించిన



అంశాలపై శిక్షణతో పాటు శారీరక దారుఢ్య పరీక్షలకు సిద్ధమయ్యేలా ఫిజికల్ ట్రైనింగ్ కూడా అందించనున్నారు.

అర్హత కలిగిన అభ్యర్థులు అక్టోబర్ 3 నుంచి 7, 2026



వరకు సమీపంలోని సంబంధిత పోలీస్ స్టేషన్లలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. పోలీసు ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువత ఈ ఉచిత కోచింగ్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

15

# సివిల్ సప్లైస్ అధికారులకు ప్రత్యేక శిక్షణ

**హైదరాబాద్, త్రైనెట్ న్యూస్, అక్టోబర్ 03:**
తెలంగాణలో ప్రభుత్వానికి ధాన్యం ఇవ్వకుండా బకాయి పడ్డ రైస్ మిల్లర్లకు ప్రభుత్వం స్పష్టమైన హెచ్చరిక జారీ చేసింది. ప్రభుత్వ ధాన్యాన్ని తిరిగి ఇవ్వండి, లేదా మీ ఆస్తులను కోల్పోవడానికి సిద్ధపడండి. పౌర సరఫరాల శాఖ కమిషనర్, ప్రభుత్వ ఎక్స్-అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం. స్టీఫెన్ రవీంద్ర (ఐపీఎస్) ఆదేశాల మేరకు శాఖ ఈ కఠిన చర్యలకు సిద్ధమైంది..

దీని అమలు కోసం, రెవెన్యూ రికవరీ చట్టం కింద బకాయి ఉన్న మిల్లర్ల నుంచి డబ్బు వసూలు చేయడానికి పౌర సరఫరాల శాఖ ఒక స్పెషల్ డ్రైవ్ ప్రారంభించింది. చట్టపరంగా ఆస్తులను వేగంగా, ఎలాంటి లోపాలు లేకుండా జప్తు చేయడానికి, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పౌర సరఫరాల అధికారుల కోసం అక్టోబర్ 5 నుండి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల ఇన్‌స్టిట్యూట్‌లో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తోంది. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్ ) ఇవ్వని వారు లేదా కనీస మద్దతు ధర (ఎంఎస్పీ ) తో ప్రజల డబ్బుతో కొన్న ప్రభుత్వ ధాన్యాన్ని దారి మళ్లించాలని చూసే మిల్లర్లను లక్ష్యంగా చేసుకుని ఈ కొత్త రూల్స్ తెచ్చారు. అధికారుల తనిఖీలలో గోదాముల్లో ధాన్యం తక్కువగా ఉన్నట్లు తేలితే, వెంటనే శాఖ షోకాజ్



నోటీసు ఇస్తుంది. దీనిపై మిల్లర్లు సమాధానం చెప్పడానికి కేవలం ఏడు రోజుల గడువు మాత్రమే ఇస్తారు. ఆ తర్వాత కఠిన చర్యలు తీసుకుంటారు.

ఈ గడువులోగా మిల్లర్లు స్పందించకపోతే, రైస్ మిల్ యంత్రాలు, వాహనాలు మరియు బ్యాంకు అకౌంట్ల వంటి ఆస్తులను జప్తు చేయాలని జిల్లా కలెక్టర్లు ఆదేశాలు జారీ చేస్తారు. ఈ ఆస్తులను అమ్మినా ప్రభుత్వ నష్టం తీరకపోతే, ఆ మిల్లర్ల భూములు, ఇళ్లు వంటి స్థిరాస్తులను కూడా సీజ్ చేసి బహిరంగ వేలం వేస్తారు.

ఎక్కడా ఎలాంటి తప్పులు జరగకుండా ఈ చట్టాన్ని కఠినంగా అమలు చేయడానికి, అధికారులకు ఈ వర్క్‌షాప్‌లలో శిక్షణ ఇస్తారు. ఏ చర్య తీసుకున్నా అది చట్టబద్ధంగా ఉండేలా, రికార్డుల్లో ఎలాంటి తప్పులు లేకుండా చూడటమే ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశ్యం. పక్కాగా తనిఖీలు ఎలా చేయాలి, పంచనామాలు ఎలా రాయాలి, వీడియో ఆధారాలను ఎలా సేకరించాలి అనే విషయాలపై డిప్యూటీ తహసీల్దార్లు (డీటీ ), అసిస్టెంట్ సివిల్ సప్లైస్ ఆఫీసర్లకు (ఆక్సో) ఫీల్డ్ ట్రైనింగ్ ఇస్తున్నారు. అదే సమయంలో, బకాయిలు ఎంత ఉన్నాయో కచ్చితంగా లెక్కించడం, రికవరీ రికార్డులను నిర్వహించడంపై అసిస్టెంట్ మేనేజర్లు (ఎం), జిల్లా మేనేజర్లకు (డీఎం) కూడా ట్రైనింగ్ ఇస్తున్నారు. బకాయి పడ్డ మిల్లర్ల ఆస్తులను గుర్తించి వెంటనే జప్తు చేయడానికి, రెవెన్యూ అధికారులతో ఎలా కలిసి పని చేయాలనే దానిపై జిల్లా సివిల్ సప్లైస్ ఆఫీసర్లకు (ణజూూ) కూడా సూచనలు ఇస్తున్నారు.

రెవెన్యూ రికవరీ చట్టాన్ని ఒక ఆయుధంగా వాడుకుంటూ, బకాయి పడ్డ మిల్లర్ల ఆస్తులపై ఎలాంటి సంకోచం లేకుండా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోగలరని కోరారు.

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక

సాంస్కృతికం
మన సంస్కృతి.. మన గర్వం..



ఆదివారం అక్టోబర్ 04, 2026
www.trinetnews.com

# ఈనెల 10 వ తేదీనుండి 18 వ తేదీ వరకు ఘనంగా బతుకమ్మ వేడుకలు

**బతుకమ్మ వేడుకల ఏర్పాట్లపై సి.ఎస్ సంజయ జాజు సమీక్ష**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 3:** తెలంగాణ సంస్కృతీ ప్రత్యేకత గాంచిన బతుకమ్మ పూల పండగను ఈనెల 10 వ తేదీనుండి 18 వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. ఈనెల 10 నుండి 18 వ తేదీ వరకు నిర్వహించే బతుకమ్మ వేడుకల ఏర్పాట్ల పై శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల కార్యదర్శులు, పోలీస్ అధికారులు హాజయ్యారు. ఈ సందర్భంగా సిఎస్ ఈనెల 18 వ తేదీన సద్దుల బతుకమ్మ ను పురస్కరించుకొని ట్యాంక్ బండ్ పై వేలాది మంది మహిళలచే సద్దుల బతుకమ్మ ఉత్సవాన్ని అత్యంత వైభంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 18వ తేదీ సాయంత్రం 4 గంటలకు సచివాలయం ఎదురుగాగల అమరవీరుల స్మారక కేంద్రం నుండి వేలాది మంది మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా వచ్చి ట్యాంక్ బండ్ పైకి చేరుకుంటారని, వీరితోపాటు వందలాది మంది కళాకారులు తమ కళారూపాలతో ర్యాలీగా వస్తారని వివరించారు. ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసే ప్రత్యేక వేదిక వద్ద జరిగే ఈ బతుకమ్మ ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు హాజరవుతారని అన్నారు.



ఈ బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకొని పండగ శోభ వచ్చేలా నగరంలోని ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను ఏర్పాటు చేయడమే కాకుండా పలు జంక్షన్ల కేంద్రాల వద్ద విధ్యుత్ దీపాలతో అలంకరించాలని ఆదేశించారు. నగరంలోని అన్ని ప్రధాన కార్యాలయాలను కూడా విద్యుత్ దీపాలతో అలంకరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ట్యాంక్ బండ్ పై బతుకమ్మ ఆడేందుకు సమీపంలోని వాడలు, కాలనీలు, బస్తీల నుండి పెద్ద ఎత్తున మహిళలు వచ్చే అవకాశమున్నందున వారికి ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా, ట్యాంక్ బండ్ చిల్డ్రన్స్ పార్క్ లో ఉన్న బతుకమ్మ ఘాట్ తోపాటు నెక్లెస్ రోడ్డులో బతుకమ్మ ల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని హెచ్ఎండీఏ, జీహెచ్ ఎంసీ అధికారులను సిఎస్ ఆదేశించారు. సాయంత్రం 5 నుండి రాత్రి 10 గంటల మధ్య ట్యాంకు బండ్ పై బతుకమ్మ ఉత్సవాలు జరుగుతున్నందున ట్రాఫిక్ డైవర్షన్, బారికేడింగ్, కనీస సౌకర్యాల ఏర్పాట్లను చేపట్టాలని తెలిపారు. అమరవీరుల స్మారక కేంద్రం నుండి ట్యాంక్ బండ్ వరకు ప్రత్యేకంగా బారికేడింగ్, లైటింగ్ సౌకర్యాలను కల్పించాలని సూచించారు. బతుకమ్మ జరిగే పది రోజుల పాటు రవీంద్ర భారతిలో బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నందున అక్కడ కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. రాష్ట్రంలోని అన్ని టూరిజం కేంద్రాలు, ప్రముఖ ప్రాంతాల్లోనూ బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించాలని అన్నారు. బతుకమ్మ ఉత్సవాలను ప్రతిబింబించేలా ఈసారి ప్రత్యేక లోగోను రూపొందిస్తున్నామని వెల్లడించారు. డిసెంబర్ లో జరుగనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ను కూడా ఈ లోగోలో తెలియచేసే విధంగా రూపొందించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి వాణి ప్రసాద్, సీపీ హైదరాబాద్ వీసీ సజ్జనార్, పంచాయితీ రాజ్ కమిషనర్ దివ్య, జిహెచ్ ఎం సి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, ఆర్టీసీ ఎం.డి. నాగిరెడ్డి, సీపీ మల్కాజిగిరి బి.సుమతి, జాయింట్ పోలీస్ కమిషనర్ (ట్రాఫిక్), హైదరాబాద్ జోయెల్ డేవిస్,స్పెషల్ కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ ముకుంద రెడ్డి, హార్టికల్చర్ కమిషనర్ షేక్ యాస్మీన్ బాషా, జలమండిలి అశోక్ రెడ్డి,టూరిజం డైరెక్టర్ రంజిత్ నాయక్, శిల్పారామం, సంస్కృతిక శాఖ డైరెక్టర్ ఎ. నర్సింహారెడ్డి, ప్రత్యేక అధికారి కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# హిమాచల్ ప్రదేశ్ లోని మౌంట్ తరంగ్ 2 పర్వతాన్ని అధిరోహించి రికార్డు సృష్టించిన గురుకుల విద్యార్థి

**6,027 మీటర్ల ఎత్తైన మౌంట్ అవలీలగా అధిరోహించిన ఇస్లావత్ బన్నీ**
**తొలి భారతీయ బృందంలో చోటు..**
**విద్యార్థిని అభినందించిన సంక్షేమ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్**
అక్టోబరు 3: సంకల్పం.. క్రమశిక్షణ.. పట్టుదల ఉంటే ఎంతటి ఎత్తయిన లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని తెలంగాణ గిరిజన గురుకుల విద్యార్థి ఇస్లావత్ బన్నీ నిరూపించారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని 6,027 మీటర్ల (19,774 అడుగుల) ఎత్తైన మౌంట్ తరంగ్–2 శిఖరాన్ని అధిరోహించి చారిత్రక ఘనత సాధించారు. తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల
(టీజీటీడబ్ల్యూఆర్డీసీ) కామారెడ్డిలో బీకాం చివరి సంవత్సరం చదువుతున్న బన్నీ ఈ నెల 22న అధిరోహించారు. సెప్టెంబరు 30న తిరిగి తిరిగి సురక్షితంగా వచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో శనివారం సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ..బన్నీని శాలువాతో సత్కరించి అభినందించారు. విద్యార్థి సాధించిన ఘనతను మంత్రి ప్రశంసించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "బన్నీ సాధించిన విజయం ఒక్క విద్యార్థి విజయమే కాదు.. తెలంగాణలోని ప్రతి గురుకుల విద్యార్థికి స్ఫూర్తినిచ్చే ఘనత. చదువుతో పాటు క్రీడలు, సాహస క్రీడలు, ఇతర రంగాల్లోనూ విద్యార్థులు తమ



ప్రతిభను చాటుకోవాలి. లక్ష్యం ఎంత ఎత్తులో ఉన్నా దాన్ని చేరుకోవాలనే పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర సాధన ఉంటే విజయాన్ని సాధించవచ్చు" అని అన్నారు.
"ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడు వెనక్కి తగ్గకుండా ముందుకు సాగడమే నిజమైన క్రీడాస్ఫూర్తి. గెలుపు మాత్రమే కాదు.. సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే మనస్తత్వాన్ని కూడా క్రీడలు, సాహస కార్యక్రమాలు పెంపొందిస్తాయి. బన్నీ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది గురుకుల విద్యార్థులు క్రీడలు, సాహస రంగాల్లో ముందుకు రావాలి" అని మంత్రి ఆకాంక్షించారు.
గిరిజన విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం, గురుకుల సంస్థలు అవసరమైన ప్రోత్సాహాన్ని అందిస్తాయని మంత్రి తెలిపారు. "మన విద్యార్థులు చదువులోనే కాదు.. క్రీడలు, సాహస కార్యక్రమాలు, పరిశోధన, కళలు తదితర అన్ని రంగాల్లోనూ తమ ప్రతిభను చాటుకునేలా అవకాశాలు కల్పించాలి. ఒక విద్యార్థి విజయం మరెంతో మంది విద్యార్థులకు దారిచూపాలి" అని పేర్కొన్నారు.

**తొలి భారతీయ బృందంలో భాగస్వామ్యం**
మౌంట్ తరంగ్–2 శిఖరం సముద్రమట్టానికి 6,027 మీటర్ల ఎత్తులో ఉంది. అత్యంత క్లిష్టమైన పర్వతారోహణలో పాల్గొన్న భారతీయ బృందంలో బన్నీ భాగస్వామిగా నిలిచారు. సెప్టెంబరు 22న శిఖరాన్ని అధిరోహించి భారతీయ పర్వతారోహణ రంగంలో తనదైన ముద్ర వేశారు.
టీజీటీడబ్ల్యూఆర్ఈఐఎస్
సొసైటీ కార్యదర్శి కె. సీతాలక్ష్మి బన్నీని అభినందిస్తూ.. మౌంట్ తరంగ్–2ను అధిరోహించిన తొలి భారతీయ బృందంలో బన్నీ భాగస్వామిగా నిలవడం గిరిజన గురుకుల సొసైటీకి గర్వకారణమన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా, సాహస ప్రతిభను వెలికితీసేందుకు సొసైటీ నుంచి అవసరమైన ప్రోత్సాహం, సహకారం అందిస్తామని తెలిపారు.
బన్నీ విజయంపై అధికారులు, కళాశాల సిబ్బంది, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులలో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, సాహస స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు.
ఈ సందర్భంగా టీజీటీడబ్ల్యూఆర్ఈఐఎస్ అదనపు కార్యదర్శి నటరాజ్, జాయింట్ సెక్రటరీ డి.ఎస్. వెంకన్న, డిప్యూటీ సెక్రటరీలు వేణుగోపాల్‌రావు, సూర్యప్రకాశ్‌రెడ్డి, స్పోర్ట్స్ ఆఫీసర్ రవి కుమార్ తదితరులు బన్నీని అభినందించారు.

# పిల్లలు ఎక్కువ సమయం ఆన్‌లైన్‌లో గడుపుతున్నారు

**-తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 02:** నల్సా ఆధ్వర్యంలో జరుగుతున్న దక్షిణ మండల ప్రాంతీయ సదస్సుకు హైదరాబాద్ వేదిక కావడం సంతోషం అని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. నిన్న మన దేశం, యావత్ ప్రపంచం మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఆ మహనీయుడిని స్మరించుకుందని గుర్తు చేశారు. గాంధీజీ ముందుగా ఒక న్యాయవాది. ఆయన న్యాయాన్ని కేవలం వృత్తిగా చూడలేదు. పేదలు, బలహీనుల కోసం న్యాయాన్ని ఒక ఆయుధంగా ఉపయోగించారు. అదే స్ఫూర్తితో న్యాయ సేవా సంస్థలు కూడా పనిచేస్తున్నాయని గవర్నర్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ న్యాయం అందాలి. డబ్బు లేకపోవడం వల్ల ఎవరికీ న్యాయం దూరం కాకూడదన్నారు. ఈ సదస్సుకు పిల్లల సైబర్ భద్రత అనే చాలా ముఖ్యమైన అంశాన్ని ఎంచుకున్నందుకు జస్టిస్ విక్రమ్ నాథ్ కి , నల్సా కు గవర్నర్ ధన్యవాదాలు తెలిపారు. నేడు పిల్లలు ఎక్కువ సమయం ఆన్‌లైన్‌లో గడుపుతున్నారు. కానీ తమ పిల్లలు ఇంటర్నెట్‌లో ఏం చేస్తున్నారు అనేది చాలా మంది తల్లిదండ్రులకు తెలియడం లేదన్నారు.
ఇంటర్నెట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మన జీవితాలను ఎంతో సులభం చేశాయన్నారు. ప్రపంచంలోని సమాచారం మన చేతిలోకి వచ్చిందని, ఎక్కడున్న వారితోనైనా, ఎప్పుడైనా మాట్లాడగలుగుతున్నాం గవర్నర్ వివరించారు. కానీ పిల్లలు అమాయకులు. ఏది నిజం? ఏది అబద్ధం? ఏది మంచిది? ఏది ప్రమాదకరం? అన్నది వారు వెంటనే గుర్తించలేరని గవర్నర్ తెలిపారు. తెలియక పిల్లలు చేసే చిన్న పొరపాట్లు కూడా పెద్ద సమస్యలకు దారితీయవచ్చని గవర్నర్ పేర్కొన్నారు. వాటి ప్రభావం పిల్లలపైనే కాదు... వారి కుటుంబాలపై, సమాజంపై కూడా పడుతుంది. ఇంటర్నెట్ ఈ నేరాలను సృష్టించలేదు. కానీ నేరాలను ప్రపంచవ్యాప్తంగా చేయడం మరింత సులభం చేసిందని గవర్నర్ వివరించారు.
భయంతో పిల్లలు తమ సమస్యలను ఎవరికీ చెప్పలేకపోవచ్చు. అందుకే మన ముందున్న ప్రశ్నలు చాలా ముఖ్యమైనవని గవర్నర్ అన్నారు. పిల్లలపై సైబర్ నేరాలను ఎలా అరికట్టాలి? మన పిల్లలను ఎలా సురక్షితంగా ఉంచాలి?
బాధిత పిల్లలకు న్యాయం ఎలా అందించాలి అని ఆలోచన చేయాలన్నారు.
తెలంగాణలో మహిళలు, పిల్లల రక్షణ ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత అని గవర్నర్ అన్నారు. పోలీసులు, భరోసా




కేంద్రాలు, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, ప్రత్యేక కోర్టులు, న్యాయ సేవా సంస్థలు ఉన్నాయని గవర్నర్ తెలిపారు. భరోసా కేంద్రాల్లో మహిళలు, పిల్లలకు ఒకే చోట పోలీసు సహాయం, వైద్య సేవలు, న్యాయ సహాయం, కౌన్సెలింగ్ అందిస్తున్నామని గవర్నర్ వివరించారు. దేశంలోనే తొలి చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు హైదరాబాద్‌లో ఏర్పాటు చేశామని గవర్నర్ చెప్పారు.
పిల్లల రక్షణ కోసం పోలీసు శాఖలోని విమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో షీ –భరోసా సైబర్ ల్యాబ్‌లు పనిచేస్తున్నాయన్నారు.
సైబర్ యాప్ ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నాం అని గవర్నర్ తెలిపారు. విద్యార్థులనే సైబర్ అంబాసిడర్లుగా తయారు చేసి, తమ తోటి విద్యార్థులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నాం.
అన్ని శాఖలు కలిసి పనిచేస్తేనే పిల్లలకు రక్షణ లభిస్తుందని గవర్నర్ స్పష్టం చేశారు. బాధితులకు అవసరమైన ప్రతి సహాయాన్ని ప్రభుత్వం అందిస్తోందని, ఆర్థిక సహాయం నుంచి ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశం కల్పించడం వరకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని గవర్నర్ చెప్పారు. టీజీఎస్ – ఎల్ఎస్ఏ పాఠశాల విద్యాశాఖతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది అని తెలిపారు. దీంతో ఉపాధ్యాయులు పిల్లలకు వారి చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పిస్తున్నారని గవర్నర్ పేర్కొన్నారు ఇప్పటివరకు 3,000 మందికి పైగా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు శిక్షణ ఇచ్చామని గవర్నర్ తెలిపారు.
న్యాయం అంటే కేవలం నేరస్తుడికి శిక్ష పడటం కాదు.
న్యాయం అంటే బాధితుడి జీవితాన్ని తిరిగి నిలబెట్టడం అని గవర్నర్ అన్నారు.
ముఖ్యంగా... ఒక బిడ్డ కోల్పోయిన బాల్యాన్ని తిరిగి అందించడమే నిజమైన న్యాయం అని గవర్నర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంబంధిత అన్ని శాఖలకు గవర్నర్ ఒక ముఖ్యమైన

తెలంగాణ హైకోర్టు, టీజీఎస్–ఎల్ఎస్ఏతో కలిసి చర్చించి పిల్లల ఆన్‌లైన్ భద్రత కోసం సమగ్ర చైల్డ్ ఆన్‌లైన్ సేఫ్టీ ఫ్రేమ్‌వర్క్‌ను సిద్ధం చేయాలని
గవర్నర్ ఆదేశించారు. న్యాయ సేవా సంస్థలు చేస్తున్న మంచి కార్యక్రమాలు రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు, ప్రతి గ్రామానికి చేరేలా మా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని గవర్నర్ అన్నారు . పిల్లల ఆన్‌లైన్ భద్రతపై జరిగే ప్రతి చర్చలో తల్లిదండ్రులు భాగం కావాలని సూచించారు. ప్రతి పిల్లవాడు, ప్రతి తల్లిదండ్రి సైబర్ నేరాల కోసం -- 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ కోసం -- 1098 నంబర్లు తప్పక గుర్తుంచుకోవాలని గవర్నర్ అన్నారు. తల్లిదండ్రులకు నా విజ్ఞప్తి ఒక్కటే...మీ పిల్లలతో మాట్లాడండి. వారు ఇంటర్నెట్‌లో ఏం చేస్తున్నారు? ఎవరితో మాట్లాడుతున్నారు? ఏం చూస్తున్నారు? తెలుసుకోండి.
కానీ వారిని తప్పుపట్టేలా కాదు... ఆసక్తితో, అవగాహనతో మాట్లాడండి అని గవర్నర్ సూచించారు.
ఎందుకంటే... వాళ్లు మన పిల్లలు. వారికి మన మద్దతు కావాలి. మన మార్గదర్శకత్వం కావాలన్నారు. అన్నింటికంటే ముఖ్యంగా... మన ప్రేమ, మన అవగాహన కావాలని గవర్నర్ అన్నారు. మన పిల్లలను సురక్షితంగా ఉంచేందుకు మనమంతా కలిసి పనిచేద్దాం అని గవర్నర్ పిలుపునిచ్చారు.

# నానో యూరియాపై ప్రదర్శన క్షేత్రం





**యాదాద్రి భువనగిరి, అక్టోబరు03/ట్రైనెట్ న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పల్లెపహాడ్ గ్రామంలో గజ్జెల్లి శంకరయ్య పొలంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) పథకంలో భాగంగా నానో యూరియా వాడకంపై ప్రదర్శన క్షేత్రంను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయంను సులభతరం చేయడం, నిలువ మరియు రవాణా చేయడం సులభం, లేబర్ ఖర్చు తగ్గుతుంది పర్యావరణ పరిరక్షణ చేస్తుంది రసాయన ఎరువుల వాడకం తగ్గుతుంది అధిక దిగుబడి కోసం మరియు రైతుల ఆదాయం పెరుగుతుంది నాణ్యమైన ఆహారంను సాధ్యం చేస్తుంది భూమి యొక్క సమతుల్యతను కాపాడు తుంది.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి అంబటి వేణు, గ్రామ సర్పంచ్ సుంకరి మంజుల, సుంకరి పర్శరాములు మరియు రైతులు పాల్గొన్నారు.

# తెలుగు విశ్వవిద్యాలయం తెలుగు భాషకు ప్రేరణా కేంద్రంగా నిలవాలి

**-2026 ప్రతిభా పురస్కారాల ప్రదానంలో వెంకయ్యనాయుడు ఆకాంక్ష**



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్**
అక్టోబర్ 03 : సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం విస్తరణ సేవా విభాగం ఆధ్వర్యంలో తెలుగు సాహిత్యం లోని వివిధ రంగాల్లో విశేష సేవలు, కృషి చేసిన 12 మంది ప్రముఖులకు 2026 ప్రతిభా పురస్కారాలను భారత పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అందచేశారు. శనివారం తెలుగు విశ్వవిద్యాలయం నాంపల్లి ప్రాంగణంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ముప్పవరపు వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, తెలుగు విశ్వవిద్యాలయం లాంటి సంస్థలు కేవలం డిగ్రీల కర్మాగారాలు కాకుండా, తెలుగు భాషా సంస్కృతులకు ప్రేరణా కేంద్రంగా,తెలుగు జాతికి సాంస్కృతిక ధర్మపీఠం గా వర్ధిల్లాలని ఆకాంక్షించారు. భాష శ్వాస లాంటిదని, తెలుగు అమ్మ భాషాగా వెలుగుతూ, తల్లిదండ్రులు పిల్లలకు విధిగా తెలుగు ప్రాచీన కళలను నేర్పించాలని పిలుపునిచ్చారు . ఇష్టపడిన పనిని కష్టపడి చేస్తే నష్టముండదని గొప్ప ప్రతిఫలం ఉంటుందని అన్నారు. ప్రాథమిక విద్యలో తెలుగు భాషకు అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలని ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.
విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ
తెలుగు సాహిత్యంలోని ప్రముఖులచే నియమింపబడిన నిపుణుల సంఘం ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన సాహితీ మూర్తులను వివిధ విభాగాల్లో ఈ పురస్కారాలకు ఎంపిక చేసిందని వివరించారు
వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు అతిథులను, పురస్కార గ్రహీతలను వేదికపైకి ఆహ్వానించారు. తెలుగు వర్సిటీ భాషా సాహిత్య రంగాలకు చేస్తున్న కృషిని వివరించారు. పురస్కారాలను అందుకున్న వారిలో కవితా విభాగంలో శ్రీ కొట్ల వెంకటేశ్వర రెడ్డి, విమర్శలో ఆచార్య ఎన్. భక్తవత్సల రెడ్డి, చిత్రలేఖనంలో కూరెళ్ల శ్రీనివాస్, శిల్పంలో ఎ.ఎస్. ప్రకాష్, నృత్యంలో డా. హెచ్. అనిత, సంగీతంలో శ్రీ దుడ్డు సీతారామయ్య, పత్రికారంగంలో డా. వై. నాగేశ్వరరావు, నాటకరంగంలో సురభి వెంగమాంబ, జానపద కళారంగంలో తూర్పాటి సాలమ్మ, అవధానంలో డా. ఎం.వి. పట్వర్ధన్, ఉత్తమ రచయిత్రిగా ఆచార్య కాత్యాయని విద్మహే, నవల విభాగంలో కస్తూరి మురళీకృష్ణ ఉన్నారు. కార్యక్రమానికి విస్తరణ సేవా విభాగం ఇంచార్జ్ నెల్లుట్ల శ్రీకాంత్ సమన్వయకర్తగా వ్యవహరించారు. పురస్కార గ్రహీతలకు ఒక్కొక్కరికి రూ.30,116 నగదు, శాలువ, సత్కార పత్రం అందజేసారు

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక



# ఏకతా సమ్మేళన్ లో ఈగల్ ఫోర్స్ మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన

**అవగాహన కార్యక్రమంలో 300 మంది విద్యార్థులు, ప్రజలు పాల్గొనడం --- డ్రగ్ ఫ్రీ తెలంగాణ కోసం సమిష్టి కృషికి ఈగల్ ఫోర్స్ పిలుపు**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 03 :**
యువతలో మాదకద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన పెంపొందించడంతో పాటు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు తెలియజేసే లక్ష్యంతో తెలంగాణ ఈగల్ ఫోర్స్ అవగాహన విభాగం ఆధ్వర్యంలో ఆసిఫ్‌నగర్‌లో నిర్వహించిన ఏకతా సమ్మేళన్ కార్యక్రమంలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అవగాహన విభాగానికి చెందిన శ్రీ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో నలుగురు ఐపీఎస్ శిక్షణాధికారులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులు, సాధారణ ప్రజలకు డ్రగ్స్ వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈగల్ ఫోర్స్ బృందం ముఖ్యంగా పిల్లలు, యువతలో డ్రగ్స్ వినియోగం మరియు వ్యసనం వల్ల కలిగే తీవ్ర పరిణామాలను వివరించింది. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక మరియు చట్టపరమైన పరిణామాలపై పాల్గొన్న వారికి అవగాహన కల్పించారు. డ్రగ్స్ మరియు ఇతర హానికర పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల వ్యసనం వ్యక్తి ఆరోగ్యం,



విద్యతో పాటు కుటుంబ సంబంధాలు, సామాజిక జీవితం మరియు భవిష్యత్తుపై కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని వివరించారు. సమస్యలు ఎదురైనప్పుడు సరైన సమయంలో తల్లిదండ్రులు,
ఉపాధ్యాయులు, నిపుణులు లేదా సంబంధిత వ్యక్తుల నుంచి మార్గదర్శకత్వం, సహాయం పొందాలని సూచించారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా ఆత్మ నియంత్రణ, ఆరోగ్యకరమైన జీవనశైలి, మంచి స్నేహ సంబంధాలు, సానుకూల ఆలోచనలు మరియు బాధ్యతాయుతమైన నిర్ణయాలు ఎంతో కీలకమని అవగాహన బృందం వివరించింది. పిల్లలు, యువతను డ్రగ్స్‌కు దూరంగా ఉంచడంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు సమాజం మొత్తం కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చింది.
ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది విద్యార్థులు, ప్రజలు పాల్గొని అవగాహన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టడంలో ప్రజల భాగస్వామ్యం ఎంత ముఖ్యమో ఈ కార్యక్రమం చాటిచెప్పింది. యువతను మాదకద్రవ్యాల దుష్ప్రభావాల నుంచి కాపాడేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కార్యక్రమంలో సూచించారు.
ఈ సందర్భంగా ప్రధానంగా "డ్రగ్స్‌కు నో చెప్పండి -- జీవితం, ఆరోగ్యం, మంచి భవిష్యత్తును ఎంచుకోండి" అనే సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. విద్యార్థులు, ప్రజలు మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమంలో చురుకైన భాగస్వాములుగా మారాలని, తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు మరియు సమాజంలో కూడా డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని ఈగల్ ఫోర్స్ పిలుపునిచ్చింది. యువత భవిష్యత్తును కాపాడటంతో పాటు డ్రగ్ ఫ్రీ తెలంగాణ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఈ కార్యక్రమం ద్వారా పిలుపునిచ్చారు.

# పేదల సొంతింటి కలకు తాన్లా ఫౌండేషన్ అండ

**సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో రూ.300 కోట్లతో 5,000 ఇళ్ల నిర్మాణం**
**దసరా పండుగ రోజున భూమిపూజ**
**-- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 03:**
పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రజా ప్రభుత్వం ఒకవైపు కృషి చేస్తుండగా.. దాతృత్వ సంస్థలు కూడా ప్రభుత్వంతో చేతులు కలపడం అభినందనీయమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాల్లోని నిరుపేదల కోసం తాన్లా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఉదయ్ కుమార్ రెడ్డి సొంత నిధులతో సుమారు రూ.300 కోట్ల అంచనా వ్యయంతో 5,000 ఇళ్లను ఉచితంగా నిర్మించి ఇవ్వడానికి ముందుకు వచ్చారని తెలిపారు. దసరా పండుగ రోజున ఈ ఇళ్ల



నిర్మాణానికి భూమిపూజ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు మంత్రి ప్రకటించారు. సత్తుపల్లి మండలం బేతుపల్లి గంగారం గ్రామంలో తాన్లా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామీణ ఆరోగ్య కేంద్రం, ల్యాబొరేటరీలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి స్వయంగా రక్తపరీక్ష చేయించుకున్నారు. అనంతరం వైద్యాధికారులు, రోగులతో మాట్లాడి అక్కడ అందుతున్న వైద్య సేవలను తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తే, తాన్లా ఫౌండేషన్ తరఫున ఉదయ్ కుమార్ రెడ్డి తన సొంత నిధులతో 5,000 ఇళ్లను నిర్మించి ఇస్తానని ముందుకు వచ్చారని తెలిపారు. పేద కుటుంబాలకు కేవలం ఇల్లు మాత్రమే కాకుండా ఆత్మగౌరవంతో జీవించే సొంత చిరునామా కల్పించాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని త్వరితగతిన ముందుకు తీసుకెళ్లేందుకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి దయానంద్, జారే ఆదినారాయణ సమన్వయంతో అర్హులైన నిరుపేదలను గుర్తించి ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
పేదలకు ఆరోగ్యం.. అంతర్జాతీయ ప్రమాణాలతో క్యాన్సర్ ఆసుపత్రి
నారాయణపురం గ్రామంలో పేదలకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు శ్రీ షిరిడి సాయి జనమంగళం ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణం జరుగుతోందని మంత్రి తెలిపారు.

# ఉపాధి లక్ష్యమే ఉన్నత విద్య పరమార్థం కావాలి: మంత్రి శ్రీధర్ బాబు

**ప్రతి విశ్వవిద్యాలయంలోనూ స్టార్టప్‌లు, ఆవిష్కరణల కోసం ఇంక్యుబేషన్ సెంటర్**
**డిగ్రీతో పాటే నైపుణ్యాల సాధన నూతన ప్రమాణం కావాలి**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 03:**
జేఎన్‌టీయూహెచ్‌లో వేడుకగా 'రీచ్-2026' సదస్సు
తరగతి గదికి, పరిశ్రమల అవసరాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పూర్తిగా తగ్గించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విద్యా సంస్థలకు పిలుపునిచ్చారు. విద్యా వ్యవస్థ యువతలో ఆలోచనా శక్తిని పెంపొందించడమే కాకుండా, వారిలో నైపుణ్యాలను అందించేలా వాస్తవ ప్రపంచ సమస్యలకు పరిష్కారాలు చూపేలా సిద్ధం చేయాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి (టీజీసీహెచ్ఈ) ఆధ్వర్యంలో శనివారం కుకట్‌పల్లిలోని జేఎన్‌టీయూహెచ్‌లో నిర్వహించిన 'రీచ్--2026' (రిసెర్చ్, ఎడ్యుకేషన్ అండ్ అడ్వాన్స్‌మెంట్) సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.
తరగతి గది నుంచి భవిష్యత్ కెరీర్ వైపు, విద్య నుంచి నైపుణ్యాల వైపు, పరిశోధన నుంచి పారిశ్రామిక రంగానికి నిరంతర అనుసంధానం ఉండాలని మంత్రి పేర్కొన్నారు. మన విద్యా వ్యవస్థ కేవలం డిగ్రీ సర్టిఫికెట్లు అందించే విధానం నుంచి, విద్యార్థులకు ఆచరణాత్మక నైపుణ్యాలు అందించే దిశగా మారాలన్నారు. కోర్సు పూర్తయిన వెంటనే విద్యార్థి



ఉద్యోగానికి అర్హత సాధించాలని, పట్టా చేతికి వచ్చే సమయానికే ఆ స్థాయి సన్నద్ధత ఉండాలని పునరుద్ఘాటించారు.
విద్యార్థులు, పరిశోధకులు తమ ఆలోచనలను స్టార్టప్‌లుగా, నూతన ఉత్పత్తులుగా మలచడానికి వీలుగా ప్రతి విశ్వవిద్యాలయంలో ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. కరికులమ్ రూపకల్పన, ల్యాబ్‌ల నిర్వహణ, ఇంటర్న్‌షిప్‌లు, లైవ్ ప్రాజెక్ట్‌లు, పరిశోధనల్లో పరిశ్రమలు భాగస్వామ్యమవ్వాలని విజ్ఞప్తి చేశారు. "ఒక చేతిలో డిగ్రీ.. మరో చేతిలో నైపుణ్యం" ఉండటమే మన నూతన ప్రామాణికం కావాలన్నారు. టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో 65 ప్రభుత్వ ఐటీఐలను రోబోటిక్స్, ఆటోమేషన్, ఇండస్ట్రీ 4.0 వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన కేంద్రాలుగా (ఏటీసీ) తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు. 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' ద్వారా సరికొత్త విద్యా, నైపుణ్య వ్యవస్థను నిర్మిస్తున్నామని తెలిపారు.
'తెలంగాణ రైజింగ్ ఏ2047' లక్ష్యంతో ఉన్నత విద్యను ప్రపంచస్థాయిలో తీర్చిదిద్దడం, పరిశోధనల్లో ప్రతిభను పెంచడం, ఆవిష్కరణల వ్యవస్థను బలోపేతం చేయడంపై ఈ సదస్సులో విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో సైయెంట్ వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ బి.వి.ఆర్. మోహన్ రెడ్డి, టీజీసీహెచ్ఈ ఛైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి, జేఎన్‌టీయూహెచ్ విసి ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్ రెడ్డి, ఉస్మానియా వర్సిటీ విసి ప్రొఫెసర్ ఎం. కుమార్, ప్రొఫెసర్ పురుషోత్తంలతో పాటు వివిధ వర్సిటీల ఉపకులపతులు, 60కి పైగా ఉన్నత విద్యాసంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.
విశ్వవిద్యాలయాలు, పరిశ్రమల మధ్య కుదిరే నూతన భాగస్వామ్యాలు, ఉమ్మడి పరిశోధనలు, స్టార్టప్‌లు, విద్యార్థులకు లభించే ఉపాధి అవకాశాల ప్రాతిపదికన మాత్రమే ఈ 'రీచ్' సదస్సు విజయాన్ని అంచనా వేయగలమని నిపుణులు అభిప్రాయపడ్డారు. విద్యార్హతలకు, పారిశ్రామిక అవసరాలకు ఉన్న వ్యత్యాసాన్ని కేవలం చర్చించడమే కాకుండా పూర్తిగా తుడిచిపెట్టేందుకు పరిశ్రమలు, విద్యాసంస్థలు చేయి చేయి కలపాలని మంత్రి శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు.

# తెలంగాణ సాహితీ తేజోమూర్తి డా. బోయ జంగయ్య 84వ జయంతి ఘనంగా నిర్వహణ

**రవీంద్రభారతిలో డా. బోయ జంగయ్య నవల సాహిత్య సంపుటి ఆవిష్కరణ**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్ ,**
అక్టోబర్ 3: తెలంగాణ సాహితీ తేజోమూర్తి, ప్రముఖ రచయిత డా. బోయ జంగయ్య 84వ జయంతి సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో శనివారం రవీంద్రభారతిలో ప్రత్యేక సాహిత్య కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డా. బోయ జంగయ్య నవల సాహిత్య సంపుటిని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఏ. వాణి ప్రసాద్, ఐఏఎస్ ఆవిష్కరించారు. బోయ జంగయ్య సాహిత్యం తెలంగాణ సామాజిక జీవనాన్ని, అణగారిన వర్గాల జీవిత అనుభవాలను, మానవ సంబంధాలను తనదైన శైలిలో ప్రతిబింబించిందని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు సాహితీవేత్తలు డా. బోయ జంగయ్య రచనా ప్రస్థానాన్ని, నవలలు--కథలు--కవిత్వంలో ఆయన చేసిన విశిష్ట కృషిని వివిధ కోణాల్లో విశ్లేషించారు. ఆచార్య కాసిం, కోయి కోటేశ్వరరావు, గడ్డం మల్లేశం, కాసుల ప్రతాపరెడ్డి, దున్న యాదగిరి, గోగు శ్యామల, బి.ఎస్. రాములు తదితరులు



బోయ జంగయ్య సాహిత్య ప్రాసంగికతను, సమాజంపై ఆయన రచనల ప్రభావాన్ని వివరించారు. బోయ జంగయ్య కుటుంబ సభ్యులు కూడా కార్యక్రమంలో పాల్గొని ఆయనతో తమకున్న అనుబంధాన్ని, సాహిత్య ప్రస్థానంలోని అనుభవాలను పంచుకున్నారు. బోయ జంగయ్య రచనలు కేవలం సాహిత్య సృజన మాత్రమే కాకుండా తెలంగాణ ప్రజల జీవన వాస్తవాలకు అద్దం పట్టే సామాజిక దస్తావేజులుగా నిలిచాయని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆయన రచనల్లోని సామాజిక స్పృహ, మానవీయ విలువలు, అణగారిన వర్గాల పట్ల నిబద్ధత నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సాహిత్య చర్చలు, ప్రసంగాలతో కార్యక్రమం ఆసాంతం అత్యంత ఆసక్తికరంగా సాగింది. డా. బోయ జంగయ్య సాహిత్యాన్ని భవిష్యత్ తరాలకు మరింత విస్తృతంగా పరిచయం చేయాల్సిన అవసరం ఉందని వక్తలు ఆకాంక్షించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా. ఎన్. బాలాచారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు, రచయితలు, కవులు, సాహిత్యాభిమానులు మరియు బోయ జంగయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో అర్హులైన పౌరుల ఓట్లను తొలగిస్తున్నారు : సినీ నటుడు ప్రకాష్ రాజ్..




**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 3:**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో అర్హులైన పౌరుల ఓట్లను తొలగిస్తున్నారని సినీ నటుడు, సామాజిక కార్యకర్త ప్రకాష్ రాజ్ ఆరోపించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు తెలంగాణ, కర్ణాటకతో పాటు పలు రాష్ట్రాల్లో చేపట్టిన క్షేత్రస్థాయి పరిశీలనల్లో ఈ అంశాలు గుర్తించినట్లు తెలిపారు. దళితులు, ఆదివాసీలు, మైనార్టీలు, మహిళలు, వలస కార్మికుల ఓటు హక్కుకు ముప్పు ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.
ఉపాధి, వైద్యం తదితర కారణాలతో తాత్కాలికంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారిని 'అందుబాటులో లేరు , శాశ్వతంగా తరలిపోయారు వంటి కారణాలతో ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారని విమర్శించారు. తొలగించిన పేర్లపై సమగ్ర పునఃపరిశీలన చేపట్టాలని, తగిన నోటీసు, అభ్యంతరాలకు అవకాశం కల్పించాలని కోరారు. ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియలో భారత ప్రధాన న్యాయమూర్తికి తిరిగి స్థానం కల్పించాలని, ఎన్నికల సంఘం స్వతంత్రతతో పాటు జవాబుదారీతనాన్ని
నిర్ధారించాలని డిమాండ్ చేశారు. తనకు నాలుగు ఓటరు గుర్తింపు కార్డులు ఉన్నాయన్న ఆరోపణలను ఖండించిన ప్రకాష్ రాజ్, పాత ఓటరు నమోదును తొలగించేందుకు గతంలోనే దరఖాస్తు చేసినట్లు వివరించారు. ఎస్ఐఆర్‌ను తక్షణమే నిలిపివేసి, ఓటర్ల జాబితాలను పారదర్శకంగా పరిశీలించాలని, అధికారుల తప్పిదాలకు బాధ్యత నిర్ధారించాలని కోరారు. డిమాండ్లపై స్పందన లేకపోతే ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాలు చేపట్టడంతో పాటు న్యాయపోరాటం చేస్తామని ప్రకాష్ రాజ్, పౌర హక్కుల నాయకులు స్పష్టం చేశారు.

# మెట్టిగూడ రాజేందర్ యాదవ్ ఆధ్వర్యంలో

**రెండో ఫేస్ సార్ న్యూ ఓటర్లు ఫామ్ 6 డిస్ట్రిబ్యూషన్**

**ట్రైనెట్ న్యూస్ సికింద్రాబాద్అక్టోబర్3/10/2026**



ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి --
సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ శ్రీ ర్యాల రాజేందర్ యాదవ్
ఈరోజు రెండో ఫేస్ కార్యక్రమం లో భాగంగా
మెట్టుగూడ కాంగ్రెస్ పార్టీ హెల్ప్ డిస్క్ ఎరుపాటు చేసి ఓటర్లు కి ఫార్మ్ 6 పంపిన చేసారు
ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ డివిజన్ నాయకులు మహిళా నాయకురాలు రూప రూత్ క్లారి, కస్తూరి, సంతోషి , సుజాత నిర్మల తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జేఎంఎఫ్ఏ 30 ఏళ్ల వేడుకలు



**హైదరాబాద్, అక్టోబర్ 4 (ట్రినెట్ న్యూస్):**
జేఎంఎఫ్ఏ 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన విజయోత్సవ సమావేశం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా జన్మదిన వేడుకలు జరుపుకొంటున్న పండు గారికి నిర్వాహకులు, సభ్యులు పుష్పగుచ్ఛాలు అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జేఎంఎఫ్ఏ ప్రతినిధులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# న్యాల్‌కల్ మండల గ్రామపంచాయతీల లో ఉప సర్పంచ్‌ల చెక్.. అధికారం పై కీలక ఆదేశాలు

- **చెక్కు అందిన ఏడు పది రోజుల్లోగా సంతకం చేయాలి.. ఉద్దేశపూర్వక జాప్యంపై చర్యలకు అవకాశం**

శిన్యాల్కల్ గ్రామ పంచాయతీల్లో చెక్కులపై సంతకాల జాప్యానికి చెక్ పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సర్పంచ్ సంతకం చేసిన సంబంధిత చెక్కును ఉప సర్పంచ్‌కు సమర్పించిన తేదీ నుంచి ఏడు పనిదినాల్లోగా సంతకం చేయాల్సి ఉంటుంది.సరైన కారణం లేకుండా ఉప సర్పంచ్ చెక్కుపై సంతకం చేయకపోవడం లేదా డిజిటల్ సిగ్నేచర్ ద్వారా వ్యయాన్ని ఆమోదించడంలో ఉద్దేశపూర్వకంగా జాప్యం చేసినట్లు జిల్లా కలెక్టర్ విచారణలో తేలితే పంచాయతీరాజ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

edited, Printed, Published and Owned by:Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136